www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -216 సోమవారం 23 నవంబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు ఆధ్యాత్మిక సంప్రదాయాలపై అవగాహన లేదు

భయం, కోపం, ద్వేషంతో ప్రేమను అర్థం చేసుకోలేరు.. రాహుల్ గాంధీ విమర్శలు



న్యూఢిల్లీ: నవంబర్ 22 (ప్రజావినికిడి):
బీజేపీ, ఆర్ఎస్ఎస్‌పై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. భారతీయ ఆధ్యాత్మిక, ధార్మిక సంప్రదాయాలపై ఆ రెండు సంస్థలకు సరైన అవగాహన లేదని వ్యాఖ్యానించారు. **మిగతా 2లో..**

90 సీట్లు, కోటి ఓట్లు సాధిస్తాం

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ 90 సీట్లు గెలుచుకుంటుంది: సీఎం రేవంత్ రెడ్డి

రాహుల్ గాంధీని ప్రధానిని చేసేందుకు 15 లోక్‌సభ స్థానాలు గెలవాలని పార్టీ శ్రేణులకు పిలుపు

గతంలో టీడీపీ, బీఆర్ఎస్ తరహాలోనే కాంగ్రెస్ కూడా పదేళ్లు అధికారంలో ఉంటుందని వ్యాఖ్య

తెలంగాణ చేపట్టిన కులగణన దేశానికే ఆదర్శంగా నిలిచిందని వెల్లడి



హైదరాబాద్ నవంబర్ 22 (ప్రజావినికిడి):
తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 90 స్థానాలు సాధించడంతో పాటు కోటి ఓట్లు పొంది తిరిగి అధికారాన్ని నిలబెట్టుకుంటుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో 15 లోక్‌సభ సీట్లు గెలుచుకుని, రాహుల్ గాంధీని దేశ ప్రధానిని చేసే బాధ్యతను తెలంగాణ కాంగ్రెస్ తీసుకోవాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో **మిగతా 2లో..**



వరంగల్ నుంచే కాంగ్రెస్ పతనం

హన్మకొండజనచైతన్య సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

వరంగల్ను ఫ్యూచర్ సిటీగా చేసే బాధ్యత నాదే...

కోటి మంది మహిళలను కోటేశ్వరులను చేయడం కాదు..

కోటి 67 లక్షల మంది మహిళలను లక్షాధికారులుగాచేయి

రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటాను

వరంగల్ గడ్డ నుంచి ఇదే నా సవాల్..

2028లో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయం: కేటీఆర్

పోస్టులో ఇంటికే కొత్త అడంగల్

భూ యజమానుల ఇళ్లకే సవరించిన అడంగల్ పత్రాలు

పోస్టల్ శాఖ ద్వారా పంపిణీకి ఏపీ ప్రభుత్వం నిర్ణయం

ప్రతి నెలా 26 నుంచి 30వ తేదీ మధ్య డెలివరీ

అడంగల్ జాప్యంపై 40-50 శాతం అసంతృప్తి నేపథ్యంలో చర్యలు



అమరావతి:నవంబర్ 22 (ప్రజావినికిడి):
ఆంధ్రప్రదేశ్‌లోని భూ యజమానులకు ఊరటనిచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భూముల మ్యుటేషన్ ప్రక్రియ పూర్తయిన వెంటనే, సవరించిన కొత్త అడంగల్ పత్రాలను **మిగతా 2లో..**

మాదకద్రవ్యాల రహిత సమాజం కోసం గళమెత్తాలి

ముక్త్ నషా ఈవెంట్ కు ప్రభాస్ ను ఆహ్వానించిన కిషన్ రెడ్డి..

'నషా ముక్త్ భారత్' ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని ఆహ్వానం

'హైదరాబాద్ వాక్స్' ప్రచార టీషర్ట్‌లను ఆవిష్కరించిన ప్రభాస్



హైదరాబాద్ నవంబర్ 22 (ప్రజావినికిడి):
దేశవ్యాప్తంగా మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'నషా ముక్త్ భారత్' ఉద్యమంలో భాగస్వామ్యం కావాల్సిందిగా పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌కు ఆహ్వానం అందింది. కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి నేడు ప్రభాస్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఇవాళ హైదరాబాద్ లో ప్రభాస్ నివాసానికి వెళ్లిన ఆయన. **మిగతా 2లో..**

జనసేన శ్రేణులకు పూర్తి స్వేచ్ఛ..



పంచాయతీ ఎన్నికల్లో ఎవరైనా పోటీ చేయవచ్చు: పవన్ కల్యాణ్ ప్రకటన

పార్టీ శ్రేణులు ఎవరైనా స్వేచ్ఛగా నామినేషన్లు వేయవచ్చని స్పష్టీకరణ

పోటీ చేయాలనుకునే వారిని నాయకులు ఎవరూ అడ్డుకోవద్దని ఆదేశం

స్థానిక సంస్థలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఎన్నికలు జరగాలని పిలుపు

అమరావతి:నవంబర్ 22 (ప్రజావినికిడి):
ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే జనసేన పార్టీ శ్రేణులకు ఆ పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ పూర్తి స్వేచ్ఛనిచ్చారు. పార్టీ నాయకులు, జనసైనికులు, వీర మహిళలు ఎవరైనా ఎలాంటి రాజకీయపరమైన అడ్డంకులు లేకుండా స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసి ఎన్నికల బరిలో నిలవవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. **మిగతా 2లో..**

న్యాయ రంగంలో ఏఐ వాడకంపై నిషేధం సరికాదు

ఏఐని నిషేధిస్తే చాటుమాటుగా వాడతారు: సీజేఐ సూర్యకాంత్ హెచ్చరిక

శంషాబాద్‌లో జరిగిన సదస్సులో సీజేఐ సూర్యకాంత్ కీలక సూచనలు



హైదరాబాద్ నవంబర్ 22 (ప్రజావినికిడి):
న్యాయ రంగంలో కృత్రిమ మేధ (ఏఐ) వాడకాన్ని పూర్తిగా నిషేధించడం ఆచరణ సాధ్యం కాదని, వివేకవంతమైన చర్య కూడా కాదని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. నిషేధం విధించడానికి బదులుగా, స్పష్టమైన నిబంధనలతో నియంత్రించడం, బాధ్యతాయుతమైన వినియోగాన్ని **మిగతా 2లో..**

నీట్-పీజీ కౌన్సెలింగ్ గందరగోళం..

10,000కు పైగా మెడికల్ సీట్లు బ్లాక్!

ఆల్ ఇండియా, స్టేట్ కోటాలలో ఒకేసారి సీట్లు పొందుతున్న అభ్యర్థులు



నీట్-పీజీ 2026 కౌన్సెలింగ్‌లో తీవ్ర గందరగోళం నెలకొంది. రెండో రౌండ్ కౌన్సెలింగ్ ముగిసిన తర్వాత కూడా 10,000కు పైగా పోస్ట్‌గ్రాడ్యుయేట్ మెడికల్ సీట్లు 'బ్లాక్' అయినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. కొందరు అభ్యర్థులు ఆల్ ఇండియా కోటాతో **మిగతా 2లో..**

వికారాబాద్ జిల్లాలో ఆటోను ఢీకొట్టిన లారీ

ఆటోలోని నలుగురు అక్కడికక్కడే మృతి

మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారిగా గుర్తింపు



వికారాబాద్ నవంబర్ 22 (ప్రజావినికిడి):
తెలంగాణలోని వికారాబాద్ జిల్లాలో జరిగిన ఘోర ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం చెందారు. వివరాల్లోకి వెళితే.. వికారాబాద్ జిల్లాలోని బుగ్గ రామేశ్వరం వద్ద వేగంగా వచ్చిన ఓ లారీ, ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ నగేష్‌తో పాటు అందులో ప్రయాణిస్తున్న చంద్రమ్మ, పార్వతమ్మ, సరిత అక్కడికక్కడే మృతి చెందారు.
మిగతా 2లో..

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

జనసేన శ్రేణులకు పూర్తి స్వేచ్ఛ..

మొదటిపేజీ తరువాయి

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ముందుకొచ్చే జనసేన శ్రేణులను పార్టీలోని నాయకులు ఎవరూ అడ్డుకోకూడదని పవన్ కల్యాణ్ కరాఖండిగా ఆదేశాలు జారీ చేశారు. స్థానిక స్థాయిలో ప్రజాసేవ చేయాలనే ఆసక్తి, ప్రజల మద్దతు ఉన్న ప్రతి ఒక్కరికీ అవకాశం దక్కాలన్నదే తమ విధానమని పేర్కొన్నారు.మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల తరహాలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి స్థానాల పంపకాలు (సీట్ల సర్దుబాటు) ఉండవని పవన్ కల్యాణ్ తేల్చిచెప్పారు. పంచాయతీ ఎన్నికలు రాజకీయ పార్టీలకు అతీతంగా, స్థానిక సంస్థలను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో జరిగే ఎన్నికలని ఆయన గుర్తుచేశారు. ఈ క్రమంలో పోటీ చేయాలనుకునే ప్రతి పౌరుడికి నామినేషన్ దాఖలు చేసే పూర్తి హక్కు ఉంటుందన్నారు.

జనసేన పార్టీ ఎల్లప్పుడూ ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తుందని, రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తి స్వేచ్ఛాపూరిత వాతావరణంలో, నిష్పక్షపాతంగా జరగాలని ఆకాంక్షిస్తున్నట్లు పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. స్థానిక సంస్థల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడేందుకు పార్టీ శ్రేణులు బాధ్యతాయుతంగా ముందుకు సాగాలని సూచించారు.

పోస్టులో ఇంటికే కొత్త అడంగల్

మొదటిపేజీ తరువాయి

నేరుగా యజమానుల నివాసాలకే పోస్టు ద్వారా పంపాలని నిశ్చయించింది. ఈ నిర్ణయంతో భూ యజమానులకు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే అవస్థలు తప్పనున్నాయి.

ఈ మేరకు భూ పరిపాలన శాఖ ముఖ్య కమిషనర్ (సీసీఎల్ఏ) జి. జయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి నెలా 26 నుంచి 30వ తేదీ మధ్య ఈ పత్రాల పంపిణీ ప్రక్రియ కొనసాగుతుందని, ప్రస్తుత నెల నుంచే ఈ విధానం అమల్లోకి వస్తుందని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్లు, ఆర్డీవోలు, సబ్-కలెక్టర్లను ఆదేశించారు.రాష్ట్రవ్యాప్తంగా అక్టోబర్ 1 నుంచి నవంబర్ 15 మధ్య సుమారు 31,000 లావాదేవీ (ట్రాన్సాక్షన్), సవరణ (కరెక్షన్) మ్యుటేషన్ దరఖాస్తులు నమోదయ్యాయి. వీరికి సంబంధించిన సవరించిన అడంగల్ ప్రతులను నవంబర్ 26 నుంచి 30వ తేదీ లోపు పంపిణీ చేయనున్నారు.తహసీల్దార్ ఆమోదం లభించినప్పటికీ, అడంగల్ ప్రతులు అందడంలో జాప్యం జరుగుతోందని 'ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్' (ఐవీఆర్ఎస్) ద్వారా అందిన ఫీడ్‌బ్యాక్‌లో 40 నుంచి 50 శాతం మంది యజమానులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం తాజా నిర్ణయం తీసుకుంది.

పంపిణీలో ఎలాంటి ఆటంకాలు ఎదురవ్వకుండా, మ్యుటేషన్ దరఖాస్తుల్లో శాశ్వత చిరునామాతో పాటు ప్రస్తుత సమాచార మార్పిడి (కరెస్పాండెన్స్) చిరునామాను కూడా తప్పనిసరిగా నమోదు చేయనున్నారు. ఈ నూతన విధానం ద్వారా రెవెన్యూ సేవల్లో వేగం, పారదర్శకత మెరుగుపడతాయని అధికారులు ఆశిస్తున్నారు.


మాదకద్రవ్యాల రహిత సమాజం కోసం గళమెత్తాలి

మొదటిపేజీ తరువాయి

కేంద్ర ప్రభుత్వం విస్తృతంగా నిర్వహిస్తున్న డ్రగ్స్ వ్యతిరేక ప్రచారానికి మద్దతు ఇవ్వాలని కోరారు.సమాజంలో, ముఖ్యంగా యువతలో డ్రగ్స్ వినియోగంపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ప్రభాస్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సంయుక్తంగా 'హైదరాబాద్ వాక్స్ నషా ముక్త్ భారత్' (ఎఎనవత్ఖిఎఽన ఔుశ్రీఎం ఛ్ఖింష్ణు వీబన్ దీష్ణుతీఖ్) కార్యక్రమానికి సంబంధించిన ప్రత్యేక టీషర్ట్‌లను ఆవిష్కరించారు.దేశాన్ని మాదకద్రవ్యాల రహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలనే ప్రధాన సందేశాన్ని ఈ ప్రచారం చాటిచెబుతోంది. ఈ సందర్భంగా "మాదకద్రవ్యాల రహిత భారత్ కోసం మనమందరం గళమెత్తుదాం!" అంటూ పిలుపునిచ్చారు. యువతలో విపరీతమైన అభిమానం ఉన్న ప్రభాస్ వంటి అగ్ర నటుడు ఈ అవగాహన ఉద్యమానికి మద్దతు తెలపడం ద్వారా సమాజంలో మరింత సానుకూల ప్రభావం పడుతుందని భావిస్తున్నారు.

బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు ఆధ్యాత్మిక సంప్రదాయాలపై అవగాహన లేదు

మొదటిపేజీ తరువాయి



బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకుల్లో కులతత్వం, పురుషాధిక్య భావజాలం, దురాశ ఉన్నాయని విమర్శించారు.ఆదివారం సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో అర్ధనారీశ్వర శిల్పానికి సంబంధించిన చిత్రాన్ని పంచుకుంటూ రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయాల లోతుల్లోకి వెళ్లేకొద్దీ ప్రేమ, సమానత్వం, పరస్పర అనుబంధం వంటి విలువలు స్పష్టమవుతాయని పేర్కొన్నారు. అయితే బీజేపీ, ఆర్ఎస్ఎస్ మద్దతుదారులకు ఈ విషయాలు అర్థం కావడం లేదని విమర్శించారు.భయం, కోపం, ద్వేషం అనే మూడు భావాలు వలలుగా మారి వారి హృదయాలను కప్పేశాయని, అందుకే వారు ప్రేమను వ్యక్తపరచలేకపోతున్నారని రాహుల్ పేర్కొన్నారు. నిజమైన హిందువుగా వారిని ఆ భావజాలం నుంచి బయటపడేయడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు.ఇటీవల తన తల్లి సోనియాగాంధీ ఆత్మకథ బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో తల్లిదండ్రుల అనుబంధం గురించి రాహుల్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నేతలు విమర్శలు చేశారు. ఈ నేపథ్యంలోనే ఆయన అర్ధనారీశ్వర శిల్పాన్ని ప్రస్తావిస్తూ తనదైన శైలిలో స్పందించారు.

నీట్-పీజీ కౌన్సెలింగ్ గందరగోళం..

మొదటిపేజీ తరువాయి

పాటు రాష్ట్రాల కోటాలోనూ ఏకకాలంలో సీట్లు పొంది, వాటిని నిలుపుకోవడమే ఈ సమస్యకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఈ పరిణామంతో, కొత్తగా ప్రవేశపెట్టిన 'ఫ్లోట్' విధానంలో మార్పులు చేసే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది.

నీట్-పీజీ అభ్యర్థుల కోసం పనిచేసే 'సార్థ' (ూూ=ూూూ) యాప్ విడుదల చేసిన గణాంకాల ప్రకారం, రెండో రౌండ్ తర్వాత దేశవ్యాప్తంగా 10,105 పీజీ మెడికల్ సీట్లు బ్లాకింగ్ కేటగిరీలో ఉన్నాయి. ఆల్ ఇండియా కౌన్సెలింగ్ (వీజజ)తో పాటు, వేరే కౌన్సెలింగ్‌లోనూ సీటు పొందిన అభ్యర్థుల వద్ద ఉన్న సీట్లను ఇలా గుర్తించారు. ఈ వివరాలను డాక్టర్ కపిల్ దేవ్ సోషల్ మీడియా ద్వారా బయటపెట్టగా, వైద్య సామాజిక కార్యకర్త డాక్టర్ నచికేత్ భాటియా కూడా ఈ సమస్య తీవ్రతను ప్రస్తావించారు. అత్యధికంగా ఎండీ జనరల్ మెడిసిన్‌లో 1,026, ఎంఎస్ ఆబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీలో 861, ఎంఎస్ జనరల్ సర్జరీలో 786 సీట్లు బ్లాక్ అయినట్లు డేటా స్పష్టం చేస్తోంది.

ఈ ఏడాది కొత్తగా ప్రవేశపెట్టిన 'ఫ్లోట్' విధానం విద్యార్థులకు రెండు సీట్లను ఒకేసారి నిలుపుకునే అవకాశం కల్పిస్తోందని కౌన్సెలింగ్ ప్రక్రియతో సంబంధం ఉన్న ఓ సీనియర్ అధికారి తెలిపారు. కేటాయించిన సీటును ఉంచుకుంటూనే, మెరుగైన సీటు కోసం ప్రయత్నించేందుకు ఈ విధానం వీలు కల్పిస్తుంది. అయితే ఆల్ ఇండియా, రాష్ట్రాల కౌన్సెలింగ్‌లు వేర్వేరుగా జరుగుతుండటంతో, అభ్యర్థులు రెండింటిలోనూ 'ఫ్లోట్' ఆప్షన్ ఎంచుకుని రెండు సీట్లను బ్లాక్ చేస్తున్నారని ఆయన వివరించారు.భవిష్యత్తులో ఈ సమస్యను నివారించేందుకు 'ఫ్లోట్' విధానాన్ని కేవలం మొదటి రౌండ్‌కు మాత్రమే పరిమితం చేసే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోందని ఆ అధికారి తెలిపారు. రెండో రౌండ్ నుంచే కేటాయించిన కాలేజీలో భౌతికంగా చేరడాన్ని తప్పనిసరి చేసే అంశాన్ని యోచిస్తున్నట్లు చెప్పారు. మూడో రౌండ్ కౌన్సెలింగ్ పూర్తయ్యాక పరిస్థితిని సమీక్షించి తుది నిర్ణయం తీసుకుంటామని అన్నారు. కాగా, ఈ గందరగోళం నేపథ్యంలో రెండో రౌండ్ ఫలితాలను 24 గంటలు వాయిదా వేసి, ఒక సీటును వదులుకునేందుకు అభ్యర్థులకు అవకాశం ఇవ్వాలని ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ డిమాండ్ చేసింది.

న్యాయ రంగంలో ఏఐ వాడకంపై నిషేధం సరికాదు

మొదటిపేజీ తరువాయి



ప్రోత్సహించడమే సరైన మార్గమని ఆయన అభిప్రాయపడ్డారు. శంషాబాద్‌లోని నోవోటెల్ హోటల్‌లో కామన్వెల్త్ లీగల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ (సీఎల్ఈఏ) నిర్వహించిన అంతర్జాతీయ న్యాయ విద్యా సదస్సులో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

ఏఐ వినియోగాన్ని గుర్తించే సాఫ్ట్‌వేర్‌లను గుడ్డిగా నమ్మవద్దని జస్టిస్ సూర్యకాంత్ హెచ్చరించారు. ముఖ్యంగా ఇంగ్లిష్ మాతృభాష కాని విద్యార్థులు రాసిన వ్యాసాలను కూడా ఏఐ రాసినట్లుగా ఈ టూల్స్ తప్పుగా గుర్తిస్తున్నాయని ఓ అధ్యయనాన్ని ఉటంకించారు. దీనివల్ల నిజాయతీపరులైన విద్యార్థులపై మోసగాళ్లనే ముద్ర పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐ వాడకాన్ని నిషేధిస్తే, అది చాటుమాటుగా పెరిగిపోతుందని, దానిని పర్యవేక్షించడం కష్టమవుతుందని తెలిపారు.

ఈ సందర్భంగా న్యాయ విద్యార్థులకు జస్టిస్ సూర్యకాంత్ మరో ముఖ్యమైన సూచన చేశారు. ప్రతి న్యాయ విద్యార్థి పట్టా పొందాలంటే, కనీస కాలం పాటు న్యాయ సహాయ సేవల్లో పాల్గొనడాన్ని తప్పనిసరి చేయాలని ప్రతిపాదించారు. తరగతి గదుల్లో నేర్చుకున్న సిద్ధాంతాలను, కోర్టు హాలులోని వాస్తవాలతో అనుసంధానించడానికి ఇది దోహదపడుతుందని వివరించారు. పేదలకు న్యాయ సేవలు అందించడంలో విద్యార్థుల పాత్ర కీలకమని గుర్తుచేశారు.

న్యాయ పరిశోధనల్లో ఏఐ వాడేటప్పుడు, అది ఇచ్చే సమాచారాన్ని గుడ్డిగా నమ్మవద్దని, ప్రతి ఆధారాన్ని సరిచూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ అమానుల్లా, తెలంగాణ హైకోర్టు ఏసీజే జస్టిస్ పి.సామ్ కోషి తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్ జిల్లాలో ఆటోను ఢీకొట్టిన లారీ

మొదటిపేజీ తరువాయి





వీరంతా ఒకే కుటుంబానికి చెందినవారని, పెండ్లిముడుగు గ్రామం నుంచి పనుల నిమిత్తం కేరెల్లికి వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగిందని పోలీసులు తెలిపారు. మలుపు వద్ద లారీ అతివేగంగా, అజాగ్రత్తగా రావడమే ప్రమాదానికి కారణమని భావిస్తున్నారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు, మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వరంగల్ నుంచే కాంగ్రెస్ పతనం

హన్మకొండజనచైతన్య సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హనుమకొండ, **నవంబర్ 22 (ప్రజావినికిడి):**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని, 2028లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం హనుమకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన జనచైతన్య సభలో ఆయన ప్రసంగించారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ మోసం చేసిందని ఆరోపించారు. వృద్ధులకు నెలకు రూ.4 వేల పింఛన్, మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం, కల్యాణలక్ష్మి పథకం కింద తులం బంగారం వంటి హామీలను ప్రభుత్వం నెరవేర్చలేదని విమర్శించారు.

వరంగల్ అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆరు ప్రభుత్వ వైద్య కళాశాలలు ఏర్పాటు చేశామని కేటీఆర్ గుర్తుచేశారు. మడికొండ ఐటీ పార్కులో ఐటీ కంపెనీలను తీసుకొచ్చామని, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు పునాది వేశామని తెలిపారు. 2,250 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం గత ప్రభుత్వ హయాంలో 90 శాతం పూర్తయినా, ప్రస్తుత ప్రభుత్వం దాన్ని పూర్తి చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు.

రాష్ట్రంలో అవినీతి, కమీషన్ల పాలన కొనసాగుతోందని కేటీఆర్ విమర్శించారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ, వరంగల్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. తెలంగాణ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు.

వరంగల్‌ను పారిశ్రామిక, విద్యా, వైద్య, ఐటీ రంగాల్లో అగ్రగామి నగరంగా తీర్చిదిద్దే బాధ్యత తాము తీసుకుంటామని కేటీఆర్ ప్రకటించారు

90 సీట్లు, కోటి ఓట్లు సాధిస్తాం

మొదటిపేజీ తరువాయి



జరిగిన టీపీసీసీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ, సలహా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 92,35,833 ఓట్లు సాధించి 64 స్థానాలు గెలుచుకుందని, మిత్రపక్షమైన సీపీఐ ఒక స్థానం దక్కించుకుందని సీఎం గుర్తుచేశారు. గతంలో టీడీపీ, బీఆర్ఎస్ పార్టీలు వరుసగా రెండు పర్యాయాలు గెలిచినట్లే, కాంగ్రెస్ కూడా మళ్లీ గెలిచి పదేళ్ల పాటు అధికారంలో ఉంటుందని చెప్పారు. 2024 ఎన్నికలకు ముందే బీజేపీ 240 సీట్లకు మించి గెలవదని తాను చెప్పిన విషయం నిజమైందని పేర్కొన్నారు.ప్రభుత్వంపై బీఆర్ఎస్ అసత్య ప్రచారాలు చేస్తోందని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఇదే సమయంలో పార్టీ నాయకులకు కూడా ఆయన స్పష్టమైన హెచ్చరిక చేశారు. ప్రభుత్వంపై బహిరంగంగా నెగెటివ్ వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని, ఎవరు ఏం మాట్లాడుతున్నారో పార్టీ వద్ద పూర్తి సమాచారం ఉందని తెలిపారు. పార్టీ లైన్‌లో నడిచే వారికి భవిష్యత్తులో తగిన గుర్తింపు లభిస్తుందని చెప్పారు.సంక్రాంతి పండుగ తర్వాత ప్రభుత్వం నేరుగా ప్రజల్లోకి వెళ్లనుందని రేవంత్ రెడ్డి తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో ఏర్పడే కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని చెప్పారు. తెలంగాణలో చేపట్టిన కులగణన దేశానికే ఆదర్శంగా నిలిచిందని, దీని ఆధారంగానే దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే కేంద్రానికి లేఖ రాశారని ఆయన వివరించారు.

యలహంక ప్యాలెస్ కు వెళ్లకుండా షర్మిలను అడ్డుకున్న పోలీసులు...

బెంగళూరు ఎయిర్‌పోర్టు వద్ద వైఎస్ షర్మిల కాన్వాయ్ అడ్డగింత

ఎలహంక ప్యాలెస్‌లోకి ప్రవేశం లేదంటూ పోలీసుల స్పష్టీకరణ

కోర్టు ఆదేశాల నేపథ్యంలో నగరంలోని హోటల్‌కు షర్మిల తరలింపు

ప్యాలెస్ లీజు వివాదంపై కోర్టును ఆశ్రయించిన సిలికాన్ బిల్డర్స్

కేసు తదుపరి విచారణను డిసెంబర్ 19కి వాయిదా వేసిన కోర్టు



బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను కర్ణాటక పోలీసులు అడ్డుకున్నారు. కుటుంబ సమేతంగా నగరానికి చేరుకున్న ఆమెను జగన్ నివాసం ఉంటున్న యలహంక ప్యాలెస్ వైపు వెళ్లకుండా పోలీసులు నిలువరించారు. న్యాయస్థానం ఆదేశాలు ఉన్నందున ప్యాలెస్‌లోకి ప్రవేశించడానికి అనుమతి లేదని స్పష్టం చేస్తూ, ఆమె కాన్వాయ్‌ను దారిమళ్లించారు. ఈ క్రమంలో విమానాశ్రయం వెలుపల పోలీసులతో షర్మిల వాగ్వాదానికి దిగడంతో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

కుటుంబంలో జరగనున్న వివాహ ఏర్పాట్లకు సంబంధించి షర్మిల తన తల్లి వైఎస్ విజయమ్మ, కుమారుడు, కోడలితో కలిసి బెంగళూరు చేరుకున్నారు. అయితే విమానాశ్రయం నుంచి వాహనాల్లో బయలుదేరిన వెంటనే పోలీసులు వారిని అడ్డుకున్నారు. యలహంక వైపు వెళ్లే మార్గాన్ని కాదని, వాహనాలను బెంగళూరు నగరం వైపు మళ్లించారు. కోర్టు ఆదేశాలను పాటించాలని సూచిస్తూ ఆమెను నగరంలోని ఒక ప్రైవేట్ హోటల్‌కు తరలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా విమానాశ్రయంతో పాటు యలహంక ప్యాలెస్ పరిసరాల్లో పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈ వివాదం వెనుక న్యాయపరమైన అంశాలు ఉన్నాయి. షర్మిల పర్యటన నేపథ్యంలో, జగన్ వర్గం తరఫున సిలికాన్ బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి భీమిశెట్టి రమేశ్ బాబు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాదనలను పరిశీలించిన న్యాయస్థానం.. వైఎస్ షర్మిల గానీ, ఆమె అనుచరులు గానీ యలహంక ప్యాలెస్‌లోకి ప్రవేశించకూడదంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణను డిసెంబర్ 19వ తేదీకి వాయిదా వేసింది. ఈ కోర్టు ఆదేశాలను అమలు చేయడంలో భాగంగానే పోలీసులు విమానాశ్రయం వద్ద షర్మిలను అడ్డుకుని వెనక్కి పంపారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
సోమవారం 23 నవంబర్ 2026



కమ్ముకున్న పొగమంచు

వాజేడు,నవంబర్ 23,(ప్రజావినికిడి):
వాజేడు మండలంలో చీకుపల్లి పెద్దగొల్లగూడెం గ్రామాల మధ్య 163వ,జాతీయ రహదారిలో ఆదివారం ఉదయం మంచుపొగ కమ్ముకుంది వాహనదారులు లైట్లు వేసుకొని వెళ్ళవలసిన పరిస్థితి ఏర్పడింది ఒక రకంగా వాహనదారులు ముందుకు వెళ్ళడానికి కొంచెం ఇబ్బంది పడ్డారుద

1/70 చట్టం పటిష్ట అమలుకు ఆదివాసి సంఘాల ఆధ్వర్యంలో గ్రామస్థాయి ప్రచారం

వాజేడు,నవంబర్ 23,(ప్రజావినికిడి):
ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసుల భూమి హక్కుల పరిరక్షణ కోసం 1/70 భూ బదిలీ నియంత్రణ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలనే లక్ష్యంతో ఆదివాసి సంఘాల ఆధ్వర్యంలో గ్రామగ్రామాన అవగాహన ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.ఈ ప్రచారంలో భాగంగా ప్రతి ఆదివాసి గ్రామంలో ప్రజలకు 1/70 చట్టం ప్రాధాన్యత, భూముల రక్షణ, అక్రమ భూ బదిలీలపై చట్టపరమైన చర్యలు,పీసా చట్టం ద్వారా గ్రామసభలకు ఉన్న అధికారాలపై అవగాహన కల్పించడం జరిగింది.
ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసుల భూములు, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామస్థాయిలో ఆదివాసి యువత, మహిళలు, పెద్దలు ఐక్యంగా ముందుకు వచ్చి తమ హక్కుల పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు.
మా ప్రధాన డిమాండ్లు..
1.ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి.
2.ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించి భూముల రీ-సర్వే చేపట్టాలి.



3.పీసా చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి.
4.అక్రమ భూ బదిలీలపై చట్ట ప్రకారం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి
5.ఆదివాసుల రాజ్యాంగబద్ధమైన హక్కులను పరిరక్షించాలి.ఏజెన్సీ ప్రాంతాల చట్టాలు పరిరక్షించుటకై ఆదివాసులు అంతా ఏకమై నవంబర్ 30న వెంకటాపురం తహసిల్దార్ కార్యాలయాన్ని ముట్టడించాలని ఆదివాసి సమాజానికి పిలుపునియ్యడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆదివాసి నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కోర్స నరసింహమూర్తి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వాసం నాగరాజు, గోండ్ వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి, ములుగు జిల్లా అధ్యక్షులు పూనేం ప్రతాప్, ఆదివాసి సంక్షేమ పరిషత్ ములుగు జిల్లా కన్వీనర్ పర్షిక సతీష్, వెంకటాపురం మండల అధ్యక్షులు తుర్స కృష్ణ బాబు,తుడుం దెబ్బ వెంకటాపురం మండల అధ్యక్షులు కంతి వెంకటకృష్ణ ,ఆదివాసి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

రెండోసారి ఆర్‌టీఐ రక్షక్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాపోలు లింగస్వామి నియామకం

ప్రజా హక్కుల పరిరక్షణే లక్ష్యం.. అవినీతి, అక్రమాలపై సమాచార హక్కుతో పోరాటం

హైదరాబాద్,(ప్రజావినికిడి): నవంబర్ 22:



ఆర్‌టీఐ రక్షక్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాపోలు లింగస్వామి రెండోసారి నియమితులయ్యారు.ఈ మేరకు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. రెండోసారి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించడం తనపై ఉంచిన నమ్మకానికి నిదర్శనమని,ఈ బాధ్యతను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం సామాన్య ప్రజలకు ప్రభుత్వ పాలనలో పారదర్శకతను ప్రశ్నించే శక్తివంతమైన ఆయుధమని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు అందాల్సిన సమాచారం అందకుండా ఇబ్బందులకు గురిచేసే పరిస్థితులపై పోరాడుతామని, అవినీతి, అక్రమాలు, అధికారుల నిర్లక్ష్యాన్ని సమాచార హక్కు చట్టం ద్వారా వెలుగులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు.తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఆర్‌టీఐ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, హక్కుల కోసం పోరాడే బాధితులకు అండగా నిలుస్తానని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతుకను బలోపేతం చేయడం, ప్రభుత్వ వ్యవస్థల్లో జవాబు దారీతనం పెంపొందించడం, సామాన్యులకు న్యాయం జరిగేలా కృషి చేయడం తన ప్రధాన లక్ష్యమని వెల్లడించారు.రెండోసారి తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తూ,ప్రజా సమస్యలపై నిరంతరం స్పందించి, ఆర్‌టీఐ రక్షక్ సంస్థను తెలంగాణలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని రాపోలు లింగస్వామి స్పష్టం చేశారు.

ఘనంగా ముగిసిన ఒనస్ రోబోకాన్ ఎఐ 4.0-రోబోటిక్ ఆర్థోపెడిక్ వైద్య సదస్సు

200 మంది వైద్య నిపుణులు,50 మంది ప్రముఖ రోబోటిక్ ఆర్థోపెడిక్ సర్జన్ల భాగస్వామ్యం

హైదరాబాద్,(ప్రజావినికిడి): నవంబర్ 23,
ఓనస్ రోబోటిక్ హాస్పిటల్స్ (ఒనస్ రోబోటిక్ హాస్పిటల్స్) ఆధ్వర్యంలో నిర్వహించిన గాంధీ రోబోకాన్ ఎఐ 4.0 నాలుగవ వార్షిక రోబోటిక్ ఆర్థోపెడిక్ వైద్య సదస్సు ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీ అలుమ్ని భవనంలో ఘనంగా జరిగింది.ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన ఈ సదస్సులో 200 మంది వైద్య ప్రతినిధులు,50 మంది ప్రముఖ రోబోటిక్ ఆర్థోపెడిక్ సర్జన్లు ఫ్యాకల్టీగా పాల్గొని రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్సల్లో వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, వైద్య అనుభవాలను పంచుకున్నారు.

ప్రత్యేక ఆకర్షణగా రెండు రోబోటిక్ క్యాడవర్ వర్క్‌షాప్‌లు

ఈ సదస్సులో రెండు ప్రత్యేక రోబోటిక్ క్యాడవర్ వర్క్‌షాప్‌లు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. గాంధీ ఆసుపత్రిలో నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌ల ద్వారా ఆర్థోపెడిక్ వైద్యులకు రోబోటిక్ సహాయంతో మోకాలి కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సల్లో ప్రణాళిక, ఖచ్చితత్వం, ఆధునిక శస్త్రచికిత్స పద్ధతులపై ప్రయోగాత్మక అవగాహన కల్పించారు.అలాగే వివిధ రోబోటిక్ సర్జరీ ప్లాట్‌ఫామ్‌లపై నిపుణుల ఉపన్యాసాలు, ప్యానల్ డిస్కషన్లు, రికార్డు చేసిన శస్త్రచికిత్సల ప్రదర్శనలు, రోబోటిక్ సర్జరీ వర్క్‌ఫ్లో సెషన్లు నిర్వహించారు.ముఖ్యంగా మోకాలి పూర్తి కీళ్ల మార్పిడి (టోటల్ నీ రీప్లేసెమెంట్), పాక్షిక మోకాలి కీళ్ల మార్పిడి (పార్టీయల్ నీ రీప్లేసెమెంట్), తుంటి కీళ్ల మార్పిడి (Hip Replacement) శస్త్రచికిత్సల్లో రోబోటిక్ టెక్నాలజీ వినియోగం, సవాళ్లు, ప్రయోజనాలపై విస్తృతంగా చర్చించారు.



రోబోటిక్ సర్జరీతో ఆర్థోపెడిక్ వైద్యరంగంలో నూతన మార్పులు
డాక్టర్ బాలరాజు నాయుడు

ఈ సందర్భంగా ఓనస్ రోబోటిక్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్, ప్రముఖ రోబోటిక్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ బాలరాజు నాయుడు మాట్లాడుతూ, రోబోటిక్ సాంకేతిక పరిజ్ఞానం ఆర్థోపెడిక్ శస్త్రచికిత్సల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తోంది. అత్యాధునిక రోబోటిక్ టెక్నాలజీ ద్వారా శస్త్రచికిత్సలను మరింత ఖచ్చితమైన ప్రణాళికతో నిర్వహించే అవకాశం కలుగుతోంది.
దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ రోబోటిక్ ఆర్థోపెడిక్ సర్జన్లను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, వారి అనుభవాలను యువ వైద్యులతో పంచుకోవడం, ఆధునిక శస్త్రచికిత్స పద్ధతులపై ప్రయోగాత్మక శిక్షణ అందించడం రోబోకాన్ ఎఐ 4.0 ప్రధాన ఉద్దేశం.భవిష్యత్తులో మరింత మంది ఆర్థోపెడిక్ వైద్యులకు రోబోటిక్ శస్త్రచికిత్సలపై అవగాహన, శిక్షణ కల్పించేందుకు ఇలాంటి శాస్త్రీయ సదస్సులను కొనసాగిస్తాం అని తెలిపారు.

విజయవంతంగా నాలుగవ ఎడిషన్

రోబోటిక్ ఆర్థోపెడిక్ వైద్యరంగంలో నూతన ఆవిష్కరణలు, వైద్యుల మధ్య శాస్త్రీయ పరిజ్ఞాన మార్పిడి, అధునాతన శస్త్రచికిత్స పద్ధతులపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఈ సదస్సును నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమాన్ని డాక్టర్ బాలరాజు నాయుడు,డాక్టర్ కార్తీక్ రేపాకుల, డాక్టర్ మధుసూదన్ యాదవ్,డాక్టర్ యాదయ్య గౌడ్ సమన్వయంతో నిర్వహించారు.రోబోటిక్ ఆర్థోపెడిక్ వైద్యరంగ అభివృద్ధికి దోహదపడే ఈ నాలుగవ వార్షిక సదస్సు విజయవంతంగా ముగిసినట్లు నిర్వాహకులు ప్రకటించారు

పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన మాజీ కార్పొరేటర్ గజ్జల రామచందర్

రంగారెడ్డి,(ప్రజావినికిడి):



పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మాజీ కార్పొరేటర్, రంగారెడ్డి జిల్లా ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ గజ్జల రామచందర్ పిలుపునిచ్చారు. ఆదివారం మీర్‌పేట్ డివిజన్‌లో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఆయన పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా గజ్జల రామచందర్ మాట్లాడుతూ, ఐదేళ్ల లోపు వయస్సు గల ప్రతి చిన్నారికి తల్లిదండ్రులు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. గతంలో చుక్కలు వేయించినప్పటికీ, ప్రభుత్వం నిర్వహించే ప్రతి పల్స్ పోలియో కార్యక్రమంలో పిల్లలకు విధిగా చుక్కలు వేయించాలని స్పష్టం చేశారు. నేటి చిన్నారుల ఆరోగ్యమే రేపటి సమాజ భవిష్యత్తు అని, పోలియో రహిత తెలంగాణ నిర్మాణానికి ప్రతి తల్లిదండ్రులు బాధ్యతగా ముందుకు రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, స్థానిక మహిళలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించిన కౌన్సిలర్ బి.ఎస్.సుధీర్



షాద్‌నగర్,(ప్రజావినికిడి):మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు ఆర్టీసీ కాలనీలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు.అనంతరం కౌన్సిలర్ మాట్లాడుతూ, ఐదు సంవత్సరాల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కౌన్సిలర్ బి.ఎస్.సుధీర్ వార్డు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.పిల్లల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని, ఐదుసంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది కవిత,ఆశా కార్యకర్త అరుంధతి, అంగన్‌వాడీ సిబ్బంది పద్మ స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

సామాజిక పరివర్తన విద్యార్థులతోనే సాధ్యం

ఎమ్మార్పీఎస్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి రాగల్ల ఉపేందర్ మాదిగ





రంగారెడ్డి,(ప్రజావినికిడి):
శతాబ్దాల తరబడి కొనసాగుతున్న కుల వివక్ష, అసమానతలు తొలగిపోయి నూతన సమాజ నిర్మాణం జరగాలంటే విద్యార్థులతోనే సాధ్యమవుతుందని ఎమ్మార్పీఎస్ మాజీ రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ మాదిగ, ఎంఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ అన్నారు. ఎల్బీ నగర్‌లోని ఏబీసీ పాఠశాల ఆవరణలో నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్ము రాజశేఖర్ మాదిగ అధ్యక్షతన ఎంఎస్ఎఫ్ సరూర్‌నగర్, హయత్‌నగర్ మండలాల నూతన కమిటీల ఎన్నిక సమావేశం జరిగింది.ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయ సాధనకు మందకృష్ణ మాదిగ సాగిస్తున్న ఉద్యమంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ ద్వారా దక్కిన 9 శాతం రిజర్వేషన్లను అందిపుచ్చుకుని విద్య, ఉద్యోగాల్లో రాణించాలని కోరారు. అనంతరం ఎంఎస్ఎఫ్ సరూర్‌నగర్ మండల అధ్యక్షుడిగా మొండికత్తి గణేష్ మాదిగ,అధికార ప్రతినిధిగా మంద భాను మాదిగ, ప్రధాన కార్యదర్శిగా బర్పటి వినయ్ మాదిగ, ఉపాధ్యక్షులుగా కందుల శివ మాదిగ, కార్యదర్శులు మంద ప్రభాస్ మాదిగ,మంద ఉమేష్ మాదిగ, ప్రచార కార్యదర్శి మంద మనోహర్ మాదిగ, ఏంఎస్ఎఫ్ హయత్‌నగర్ మండల కమిటీ అధ్యక్షుడిగా జకారం రామ్ చరణ్ మాదిగ, అధికార ప్రతినిధి ఎరపుల గణేష్, ప్రధాన కార్యదర్శిగా బస్థుల రామకృష్ణ మాదిగ, ఉపాధ్యక్షులు ముత్యాల స్టాలిన్ మాదిగ, కూమపాటి రజిని మాదిగ, కార్యదర్శులు గా కల్పూరి శ్రవణ్ మాదిగ,కినేరా భవ్యశ్రీ మాదిగ, ప్రచార కార్యదర్శి అరవింద్ మాదిగ,ఏమ్ ఎస్ ఎఫ్ చైల్డ్ కమిటీ అధ్యక్షుడిగా అంకురి కార్తీక్ మాదిగ,అధికార ప్రతినిధి గా మద్దిమడుగు శివ మాదిగ,ప్రధాన కార్యదర్శి అంకురి చరణ్ మాదిగ, ఉపాధ్యక్షులు దోసపాటి వినోద్ మాదిగ, కార్యదర్శులు కొత్తపల్లి కార్తీక్ మాదిగ, మొలగార శ్రీకాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ మాజీ రాష్ట్ర కళామండలి అధ్యక్షులు మల్లేపక అనిల్ మాదిగ,ఎంఎస్పీ ఎల్బీనగర్ ఇంచార్జ్ ఎర్ర రవీందర్ మాదిగ, ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు బత్తిన సుధాకర్ మాదిగ,ఏంఎస్పి ఎల్బీనగర్ కో ఇంచార్జి మల్లెపోగు రాజు,ఎంఆర్పీఎస్ హయాత్ నగర్ మండల అధ్యక్షులు కొమ్ము శివ మాదిగ, ఎంఆర్పీఎస్ సీనియర్ నాయకులు అనంత్ సురేష్ మాదిగ,రవి మాదిగ,కలకోట్ల సాయి మాదిగ,కొత్తపేట ఎంఆర్పీఎస్ అధ్యక్షులు మంద శేఖర్ మాదిగ, కొత్తపేట సీనియర్ నాయకులు మీసాల నాగరాజు,
సూరారపు హుస్సేన్,విజయ్,మహేందర్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

ఉద్యోగాలు చేసే స్థాయి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలి

వికసిత్ భారత్ నిర్మాణంలో యువతదే కీలక పాత్ర నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి





షాద్ నగర్,(ప్రజావినికిడి): విద్యార్థులు ఉద్యోగాలు చేసే స్థాయి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని, అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఆకాశమే హద్దుగా యువత ముందుకు సాగాలని,వికసిత్ భారత్ 2047 లక్ష్య సాధనలో యువత కీలక పాత్ర పోషించాలని వివేకానంద విద్యా సంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు.షాద్‌నగర్ పట్టణంలోని వివేకానంద విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఎంబీఏ2024-26 బ్యాచ్ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ (కన్వొకేషన్) వేడుక ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉస్మానియా యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీరాములు, వివేకానంద విద్యా సంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి హాజరయ్యారు.

ఈ సందర్భంగా నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ,

ఎంబీఏ డిగ్రీ సాధించడం విద్యార్థుల జీవితంలో ఒక గొప్ప మైలురాయి అని, అయితే ఇది ముగింపు కాదని, కొత్త అవకాశాలు, బాధ్యతలతో కూడిన జీవితానికి ప్రారంభమని పేర్కొన్నారు. విద్యార్థులు కేవలం ఉద్యోగాల కోసం ఎదురుచూసే ఉద్యోగార్థులుగా మిగిలిపోకుండా,తమలోని నాయకత్వ లక్షణాలు, వ్యాపార నైపుణ్యాలు, సృజనాత్మక ఆలోచనలను పెంపొందించుకొని ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. యువత పారిశ్రామికవేత్తలుగా మారి మరికొందరికి ఉపాధి అవకాశాలు కల్పించినప్పుడే దేశ ఆర్థికాభివృద్ధికి నిజమైన తోడ్పాటు అందించిన వారవుతారని అన్నారు.

ప్రపంచం వేగంగా మారుతోందని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ టెక్నాలజీ,గ్లోబల్ మార్కెట్‌లో వస్తున్న మార్పులను యువత అందిపుచ్చుకోవాలని సూచించారు.నిరంతరం నేర్చుకునే తత్వాన్ని అలవర్చుకొని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని,వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

స్వామి వివేకానంద బోధించిన(లేవండి, మేల్కొనండి,లక్ష్యాన్ని చేరుకునే వరకు ఆగకండి)అనే సూక్తిని గుర్తుచేస్తూ,ప్రతి ఒక్కరూ ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకొని పట్టుదల, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షిస్తున్న వికసిత్ భారత్ 2047 నిర్మాణంలో యువత ఆలోచనలు ఆవిష్కరణలు, కష్టపడి పనిచేసే తత్వం అత్యంత కీలకమని,దేశ ఆర్థికాభివృద్ధి,

పారిశ్రామిక ప్రగతి,సాంకేతిక రంగాల అభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. ముఖ్య అతిథి ప్రొఫెసర్ డాక్టర్ శ్రీరాములు మాట్లాడుతూ,మార్పు ఒక్కటే శాశ్వతమని,మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని, నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ నాయకత్వలక్షణాలు,కమ్యూనికేషన్ స్కిల్స్ పొందించుకోవాలని అన్నారు.సమాజ అవసరాలకు అనుగుణంగా ఉస్మానియా యూనివర్సిటీ ఎంబీఏ విభాగం ఐపీఎస్ శిక్షణ,హాస్పిటల్ మేనేజ్‌మెంట్,ఫ్యాషన్ మేనేజ్‌మెంట్ వంటి నూతన రంగాల్లో అందిస్తున్న విద్యా సేవలను వివరించారు.కేవలం డిగ్రీలు పొందడమే కాకుండా,ఆ విద్యతో సమాజానికి,దేశానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఎంబీఏ పట్టభద్రులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎంబీఏ 2024-26 బ్యాచ్ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు. తమ విద్యా ప్రయాణంలో పట్టుదల,క్రమశిక్షణతో లక్ష్యాలను సాధించిన విద్యార్థులను,వారికి మార్గదర్శకత్వం వహించిన అధ్యాపకులనుఅభినందించారు. ఈ కార్యక్రమంలో పాలమూరు యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అర్జున్,కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహేష్ చంద్ర, డైరెక్టర్లు వడకట్టు విజయ్ కుమార్,సత్యనారాయణ,అధ్యాపకులు రమాదేవి,అనిత, సురేష్,రాజు తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా నిండు జీవితానికి రెండు చుక్కలు

చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత,కౌన్సిలర్ అశోక్



షాద్ నగర్,(ప్రజావినికిడి): చిన్నారులను పోలియో మహమ్మారి నుంచి రక్షించేందుకు ప్రభుత్వం చేపట్టిన పల్స్ పోలియోకార్యక్రమంలో భాగంగా షాద్ నగర్ మున్సిపాలిటీలోని 9వ వార్డులో గల సెంట్ మేరిస్ స్కూల్ లో పల్స్ పోలియో కార్యక్రమం ప్రాంభించిన వార్డ్ కౌన్సిలర్ అశోక్ కుమార్.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాల లోపు వయస్సు కలిగిన ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించడం జరిగింది.పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా సహకరించాలని కోరారు.పిల్లల ఆరోగ్యమే దేశ భవిష్యత్తుకు పునాది.ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునివ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం కవిత,ఆశ వర్కర్లు,అల్లం అనిల్ కుమార్ గౌడ్,కొంకల్ల మణికంఠ, ప్రవీణ్,చంద్రశేఖర్ గౌడ్,శివ కుమార్ గౌడ్ కాలని వాసులు యువకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్‌లో ఘనంగా పల్స్ పోలియో కార్యక్రమం ప్రారంభం

చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్





షాద్‌నగర్, (ప్రజావినికిడి):పట్టణంలోని బస్‌స్టాండ్‌లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగాప్రారంభించారు.షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్,ప్రజా ప్రతినిధులు,ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి,వారి ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు.ఐదేళ్లలోపు వయస్సు ఉన్న ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని,ఎవరూ నిర్లక్ష్యం చేయవద్దని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.ప్రయాణాల్లో ఉన్న చిన్నారులకు సైతం పోలియో చుక్కలు వేయించాలని,ఏ ఒక్క చిన్నారికి కూడా టీకాలు వేయకుండా మిగిలిపోకుండా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సూచించారు.పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రజలందరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

విద్యార్థుల సమ్మేళనాలు గొప్ప స్ఫూర్తిని చాటుతాయి, టీ.కరుణాకర్

షాద్ నగర్,(ప్రజావినికిడి): పట్టణంలోని చైతన్య జూనియర్ కళాశాల 2005 - 2007 విద్యా సంవత్సరంలో ఇంటర్ పూర్తి చేసుకున్న బైపిసి విద్యార్థులు స్థానిక ఏబీ కన్వెన్షన్ హాల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం పేరిట కలుసుకున్నారు.

ఎంతో ఉత్సాహంగా పండగ వాతావరణం తలపించిన ఈ అపూర్వ సమ్మేళనంలో విద్యార్థులు తమ కళాశాల రోజులను మధుర జ్ఞాపకాల పేరిట గుర్తు చేసుకున్నారు. అదే విధంగా తమ గురువులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాల కామర్స్ లెక్చరర్ ప్రస్తుత తెలంగాణ లెక్చరర్స్ పోరం వర్కింగ్ ప్రెసిడెంట్ కరుణాకర్ మాట్లాడుతూ, విద్యార్థుల సమ్మేళనాలు గొప్ప స్ఫూర్తిని చాటుతాయని విద్యార్థులలో నూతన ఉత్సాహం ఒరవడి దిద్ద గలవని పేర్కొన్నారు.విద్యార్థుల అభివృద్ధిని కాంక్షించే విద్యార్థుల తల్లిదండ్రుల తర్వాత గురువులకు ప్రత్యేక స్థానం ఉందని గుర్తు చేశారు. విద్యార్థులు ఎంత



గొప్పవారు గొప్ప స్థాయికి చేరుకున్న వారు గురువులకు ఎప్పుడు శిష్యులే అన్న విషయాన్ని చమత్కారంగా వివరించడం జరిగింది.అదేవిధంగా తెలుగు సంస్కృత అధ్యాపకులు సాకేత్ ప్రవీణ్ మాట్లాడుతూ, విద్యార్థుల ఎదుగుదల గురువులకు ఎనలేని సంతృప్తినిస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి రీ యూనియన్ కార్యక్రమాలు విద్యార్థుల గురువుల సంబంధాన్ని మరింత మెరుగుపరచగలదని



గురువులకు మరింత ఉత్సాహాన్ని నింపగలదని పేర్కొన్నారు.ఈ సందర్భంగా సెంట్రల్ యూనివర్సిటీలో సైంటిస్ట్ గా సేవలందిస్తున్న డాక్టర్ ప్రభాకర్ అనే విద్యార్థిని అధ్యాపకులంతా ఘనంగా సన్మానించి భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు.

చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి

ఎల్బీనగర్,(ప్రజావినికిడి):



దేశాన్ని పోలియో రహితంగా మార్చే లక్ష్యంతో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం ఆదివారం రోజు ఉమ్మడి బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోనిసాహెబ్ నగర్ ప్రభుత్వ పాఠశాలసాహెబ్ నగర్ బస్తీ హాస్పిటల్అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్ సి)డీపీఎస్ (డీపీస్) స్కూల్‌విజయవంతంగా జరిగింది ఈ కార్యక్రమంలో బి.యన్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వెయ్యడం జరిగింది.

ఈ సందర్భంగా లచ్చి రెడ్డి గారు మాట్లాడుతూ,చిన్నారుల ఉజ్వల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులందరూ బాధ్యతగా 5 ఏళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు మౌనిక, అక్షపాల్ తదితరులు ఉన్నారు.

వసూళ్ల రాణి సుజాత నాయక్, నీ స్థాయి మర్చిపోయి మాట్లాడుతున్నావు.

ఎల్బీనగర్,(ప్రజావినికిడి):



గత ఎన్నికల్లో బీజేపీ పార్టీ నీకు బీఫామ్ ఇచ్చి, కార్పొరేటర్‌గా పోటీ చేసే అవకాశం కల్పిస్తే, నీ విజయం కోసం ఎంతోమంది కార్యకర్తలు నిస్వార్థంగా కష్టపడి పనిచేశారు.వారి శ్రమను, నమ్మకాన్ని గుర్తించకుండా నీ స్వార్థ ప్రయోజనాల కోసం నీ మూడున్నర సంవత్సరాల రాజకీయ జీవితంలో బీజేపీ నుండి,బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీ లోకి 3 పార్టీలు మారిన చరిత్ర నీది.. నీ కోసం అహర్నిశలు కష్టపడిన కార్యకర్తల నమ్మకాన్నే వమ్ము చేసిన నువ్వా మా సుధీర్ అన్న గురించి మాట్లాడేది?రాజకీయాల్లో విమర్శలు చేసే ముందు నీ గతాన్ని ఒక్కసారి గుర్తు చేసుకో.. గతంలో నువ్వు కార్పొరేటర్‌గా ఉన్నప్పుడు ఎవరమ్మా వసూళ్లు చేసింది? రెండు, మూడు సార్లు నిన్ను,నీ పక్కన ఉండే పిఏ వెధవను ప్రజాక్షేత్రంలో ఉంటూ వసూళ్లు మానుకోండి అని సుధీర్ అన్న మందలించింది వాస్తవం కాదా? అయినా మీరు వసూళ్ల దందా ఆపకపోవడంతో సుధీర్ రెడ్డి మిమ్మల్ని మరలా గట్టిగా మందలించడంతో మీ ఆటలు సాగవు అని, మీరు బయటికి వచ్చి పార్టీ మారి, ఇపుడు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని జనాలకు తెలియదా?రోజూ వసూళ్లు చేసి నీకు రోజుకు రూ.20 వేల రూపాయలు తెచ్చి ఇస్తున్న బ్రోకర్ గాడి అరాచకాలు జనాలకు తెలియవు అనుకుంటున్నారా?పాపం మీ భర్త రాంచందర్‌ను కొట్టింది నువ్వా? నీ పిఏ గాడా? మీ దౌర్జన్యాలకు మీ నుండి దూరంగా 3 సంవత్సరాల నుండి అద్దె ఇంట్లో ఉంటున్నాడు అని జనాలు గుసగుస లాడుతున్నారు. ముందు వాళ్ళకి సమాధానం చెప్పండి. అయినా మాకు ఎందుకు లే మీ కుటుంబ విషయాలు..గతంలో నందనవనం ఖాళీ స్థలంలో షెడ్లను తొలగించి, ఇప్పుడు నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో అర్హులైన18 మంది లబ్ధిదారులను నువ్వు,మీ నాయకుడు మధు యాష్కీకి చెప్పి ఇప్పిస్తానని చెప్పి వాళ్లని మభ్య పెట్టి,5 లక్షలు ఇస్తే ఇప్పిస్తానని నీ ఇంటి చుట్టూ తిప్పుకుంటున్నది వాస్తవం కాదా? గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో డబుల్ బెడ్‌రూమ్ లాటరీలో తీసి ఇచ్చారు.మీలాగ దొంగల మాదిరిగా పేదలను మోసం చేసి గుంజుకోలేదు.వసూళ్ల రాణి, పిచ్చి వాగుడు మానకపోతే నీకు,నీ వెంట ఉండే పిఏ గాడికి చెప్పు-దెబ్బలు తప్పవు. జాగ్రత్తడఅని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పద్మనాయక్ డివిజన్ అధ్యక్షులు సత్యంచారి, డివిజన్ మహిళా అధ్యక్షురాలు ఆదిలక్ష్మి,రమాదేవి,దీపాచావన్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

హస్తినాపురం డివిజన్‌లో ఘనంగా గ్యార్మీ షరీఫ్ పండుగ ఉత్సవాలు

ఎల్బీనగర్,(ప్రజావినికిడి):ఆదివారం రోజు హస్తినాపురం డివిజన్ పరిధిలోని భూపేష్ గుప్తా నగర్ కాలనీలో గ్యార్మీ షరీఫ్ పండుగ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించడం జరిగింది.

ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పాల్గొని,గ్యార్మీ షరీఫ్ పండుగ విశిష్టతను, హజ్రత్ గౌసే ఆజం వారి ఆధ్యాత్మిక సందేశాలను ఉద్దేశించి ప్రసంగించారు.

ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సత్యం చారి, ముద్దకోని మనీష్, ముద్దకోని కళ్యాణ్,మాజీ వార్డ్ కమిటీ సభ్యులు మొహమ్మద్ సయ్యద్ పాషా, ఇబ్రహీం, రహీం,గౌసే పాక్ జిల్లా కమిటీ సభ్యులు షకీర్, రఘుతో పాటు పలువురు ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.మతసామరస్యం, సోదరభావం, సేవాభావానికి ప్రతీకగా నిలిచే ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయి

చిన్నారులకుపల్స్ పోలియో చుక్కలు వేస్తున్న: ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



ఎల్బీనగర్,(ప్రజావినికిడి):హయత్ నగర్ ప్రైమరీ స్కూల్ అనుమగల్ బస్తి నందు జరిగిన పల్స్ పోలియో కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎల్బీనగర్ శాసనసభ్యులు శ్రీ.దేవిరెడ్డి సుధీర్ రెడ్డి.. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ డివిజన్ బారాస పార్టీ అధ్యక్షులు చెన్నగోని శ్రీధర్ గౌడ్,స్థిలాబ్ తదితరులు పాల్గొన్నారు.

బిస్లెరీ వాటర్ లో ప్రమాదకర రసాయనాలు.. చర్యలకు సిద్ధమైన ఎఫ్ఎస్ఎస్ఏఐ

నవంబర్ 22 (ప్రజావినికిడి):




దేశంలో ప్రముఖ ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ తయారీ సంస్థ 'బిస్లెరీ ఇంటర్నేషనల్'పై న్యాయపరమైన చర్యలు చేపట్టేందుకు భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ సిద్ధమైంది. ల్యాబొరేటరీ పరీక్షల్లో కంపెనీకి చెందిన నీటి నమూనాలు సురక్షితం కావని తేలడంతో, సంస్థపై ప్రాసిక్యూషన్ ప్రక్రియను ప్రారంభించినట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రకటించింది.

బిస్లెరీ సంస్థకు చెందిన ప్రాంగణం నుంచి సేకరించిన ప్యాకేజ్డ్ తాగునీటి నమూనాలను తొలుత పరీక్షించినప్పుడు, అందులో 'బ్రోమేట్' పరిమాణం నిర్ణీత పరిమితుల కంటే ఎక్కువగా ఉన్నట్లు వెల్లడైంది. దీంతో ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్-2006 ప్రకారం ఆ నీటిని అన్‌సేఫ్ (సురక్షితం కానిది)గా అధికారులు ప్రకటించారు. అయితే, ప్రాథమిక పరీక్ష ఫలితాలపై బిస్లెరీ సంస్థ అప్పీల్ చేయడంతో, ఆ నమూనాలను మరింత సమగ్ర పరిశీలన కోసం రెఫరల్ ఫుడ్ ల్యాబొరేటరీకి పంపించారు.రెండో ల్యాబ్ పరిశీలనలోనూ ఆ నీటి నమూనాలు ప్రమాణాలకు అనుగుణంగా లేవని తేలింది. అంతేకాకుండా, అందులో ప్రమాదకరమైన 'పాలీన్యూక్లియర్ ఆరోమాటిక్ హైడ్రోకార్బన్స్' (పీఏహెచ్) ఉన్నట్లు నిర్ధారణ అయింది. సాధారణంగా బ్రోమేట్, పీఏహెచ్‌లను క్యాన్సర్‌కు కారణమయ్యే రసాయనాలు (కార్సినోజెన్లు)గా పరిగణిస్తారు. ఈ ల్యాబ్ నివేదికల ఆధారంగా నిబంధనల ఉల్లంఘన స్పష్టంగా రుజువు కావడంతో, బిస్లెరీ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్‌పై ఫుడ్ సేఫ్టీ చట్టం కింద ప్రాసిక్యూషన్ చర్యలు ప్రారంభించేందుకు అనుమతి మంజూరు చేసినట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ తెలిపింది. కాగా, ఈ పరిణామంపై బిస్లెరీ సంస్థ ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.

మరోవైపు, ప్రఖ్యాత మిఠాయిల తయారీ సంస్థ 'ఆశా కన్ఫెక్షనరీ'కి చెందిన ప్రీ-ప్యాక్డ్ చాక్లెట్-ఫిల్డ్ కుకీల బ్యాచ్‌ను వెంటనే మార్కెట్ నుంచి రీకాల్ చేయాలని ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశాలు జారీ చేసింది. ఆ ఉత్పత్తి లేబులింగ్, పదార్థాల నాణ్యత, భద్రతా ప్రమాణాల్లో లోపాలు ఉన్నట్లు తేలింది. పరీక్షల్లో ఆ కుకీలలో లేబుల్‌పై ప్రస్తావించని 'కార్మోసిన్' అనే సింథటిక్ రంగును గుర్తించారు. అంతేకాకుండా అనుమతించిన స్థాయి కంటే ఎక్కువగా 'టార్ట్రాజైన్', ఈ తరహా ఆహార పదార్థాల్లో అస్సలు ఉపయోగించకూడని 'సన్‌సెట్ ఎల్లో ఎఫ్‌సీఎఫ్' రంగును వాడినట్లు అధికారులు కనుగొన్నారు. దీంతో ఈ ఉత్పత్తిని నిబంధనలకు విరుద్ధమైనదిగా, నాణ్యతా లోపంతో కూడినదిగా పేర్కొంటూ, మార్కెట్లో ఉన్న ప్రభావిత బ్యాచ్ మొత్తాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సంస్థను ఆదేశించింది.

నవంబర్ చివరి వారంలో బంగాళాఖాతంలో మరో అల్పపీడనం!

నవంబర్ 22 (ప్రజావినికిడి):



దక్షిణ అండమాన్ సముద్రం, ఆగ్నేయ బంగాళాఖాతం పరిసరాల్లో నవంబర్ నెలాఖరులో ఒక ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. అయితే దీనిపై తీర ప్రాంత ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రస్తుతానికి ఎలాంటి తుపాను హెచ్చరికలు జారీ చేయలేదని వాతావరణ నిపుణులు స్పష్టం చేశారు.విశాఖపట్నం తుపాను హెచ్చరికల కేంద్రం అధిపతి పి.ఎల్.ఎన్. మూర్తి తెలిపిన వివరాల ప్రకారం... నవంబర్ 27 నుంచి డిసెంబర్ 2 మధ్య కాలంలో దక్షిణ అండమాన్ సముద్ర ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడవచ్చు. ఇది క్రమంగా బలపడి అల్పపీడనంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే, ఇది మరింత బలపడి వాయుగుండంగా మారుతుందా లేదా అనే అంశంపై ఇంకా ఎలాంటి స్పష్టత రాలేదు. ఒకవేళ బలపడినా కూడా, అది శ్రీలంక లేదా తమిళనాడు తీరం వైపు పయనించే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని, ఆంధ్రప్రదేశ్ వైపు వస్తుందని చెప్పలేమని ఆయన వివరించారు. దీని తీవ్రత, ప్రయాణించే మార్గానికి సంబంధించి ఐఎండీ ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదని తెలిపారు.

సాధారణంగా ఉపరితల ఆవర్తనం అనేది వాతావరణ వ్యవస్థలలో అత్యంత ప్రాథమిక దశ మాత్రమేనని, ఇలా ఏర్పడే ప్రతి ఆవర్తనం తుపానుగా మారదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. నవంబర్ 27 తర్వాత అల్పపీడనం ఏర్పడిన అనంతరమే దీని తదుపరి కదలికలపై ఒక అంచనాకు వచ్చే అవకాశం ఉంటుంది.మరోవైపు, ప్రస్తుతం దక్షిణ భారతదేశంలో కురుస్తున్న వర్షాలకు, నెలాఖరులో రాబోయే ఆవర్తనానికి ఎలాంటి సంబంధం లేదని ఐఎండీ స్పష్టం చేసింది. తూర్పు గాలుల (ఈస్టర్లీ వేవ్స్) ప్రభావంతో వచ్చే కొద్దిరోజులు పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తాయని తెలిపింది.కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాం, రాయలసీమ ప్రాంతాల్లో నవంబర్ 22 నుంచి 28 వరకు అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా నవంబర్ 23 నుంచి 26 మధ్య ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే సూచనలు ఉన్నాయి. తమిళనాడు, పుదుచ్చేరిలలో నవంబర్ 23 నుంచి 27 వరకు భారీ వర్షాలు, కేరళలో నవంబర్ 24 నుంచి 26 వరకు అక్కడక్కడా భారీ వర్షాలు పడవచ్చు. అండమాన్ నికోబార్ దీవుల్లో రాగల రెండు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది.ఆంధ్రప్రదేశ్ తీరానికి ప్రస్తుతం ఎలాంటి తుపాను ముప్పు లేదా రెడ్ అలర్ట్ లేదని, సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మవద్దని అధికారులు సూచించారు. వాతావరణ శాఖ ఎప్పటికప్పుడు విడుదల చేసే అధికారిక సమాచారాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేశారు.

ముగియనున్న జేఈఈ మెయిన్ రిజిస్ట్రేషన్ గడువు.. 13 లక్షలు దాటిన దరఖాస్తులు

నవంబర్ 22 (ప్రజావినికిడి):

జేఈఈ (మెయిన్) 2027 సెషన్-1 దరఖాస్తు ప్రక్రియకు సంబంధించి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) కీలక వివరాలను వెల్లడించింది. ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా దరఖాస్తు చేసుకునేందుకు ఇచ్చిన గడువు ఆదివారం రాత్రి 11:50 గంటలతో ముగియనుండగా, అప్పటికే 13.10 లక్షల మందికి పైగా అభ్యర్థులు ఫీజు చెల్లించి ప్రక్రియను పూర్తి చేసినట్లు తెలిపింది.

సోషల్ మీడియా వేదిక ఎక్స్ ద్వారా ఎన్‌టీఏ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఇప్పటివరకు మొత్తం 15,04,866 రిజిస్ట్రేషన్ ఫారమ్‌లు సమర్పించగా, అందులో 13,10,493 మంది అభ్యర్థులు ఫీజు చెల్లింపును విజయవంతంగా పూర్తి చేశారు. సాధారణ ఫీజుతో దరఖాస్తు చేసుకునేందుకు నవంబర్ 22 రాత్రి 11:50 గంటల వరకే తుది అవకాశమని స్పష్టం చేసింది. ఆ తర్వాత దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు రూ.500 ఆలస్య రుసుము చెల్లించాల్సి ఉంటుందని, లేట్ ఫీజుతో నవంబర్ 26 రాత్రి 11:50 గంటల వరకు రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు ఉందని పేర్కొంది.అభ్యర్థులు తమ దరఖాస్తులను అసంపూర్తిగా వదిలేయవద్దని ఎన్‌టీఏ సూచించింది. తదుపరి దశల్లో గుర్తింపు ధ్రువీకరణ, బయోమెట్రిక్ ప్రక్రియల్లో ఎలాంటి సమస్యలు రాకుండా ఉండేందుకు డిజిలాకర్, జన్ పరిచయ్ లేదా ఈ-ప్రమాణ్ ద్వారా లాగిన్ కావాలని స్పష్టం చేసింది. ఆన్‌లైన్ ఫారమ్ నింపే ముందే డిజిలాకర్ ద్వారా రీ-కేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించింది. అలాగే దేశీయ, విదేశీ అభ్యర్థులకు పౌరసత్వం, ఆధార్ వివరాల ఎంపికలో ఎలాంటి గందరగోళం లేకుండా స్పష్టమైన మార్గదర్శకాలను కూడా ఎన్‌టీఏ జారీ చేసింది.

షాద్‌నగర్‌లో కార్తీక కోటి దీపోత్సవానికి భారీ ఏర్పాట్లు.





షాద్‌నగర్,(ప్రజావినికిడి):

హిందూ ధర్మ పరిరక్షణ,సనాతన సంస్కృతి వ్యాప్తి, సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యం,ఐక్యతను పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న కార్తీక కోటి దీపోత్సవంలో హిందూ బంధువులందరూ పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు,తెలంగాణ విమోచన కమిటీ కన్వీనర్ నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు.

షాద్‌నగర్ పట్టణంలోని ఆకుల మనయ్య గ్రౌండ్‌లో శ్రీ ఛత్రపతి శివాజీ సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నవంబర్ 26 నుంచి 29 వరకు నాలుగు రోజుల పాటు కార్తీక కోటి దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ నేపథ్యంలో నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి ఉత్సవ సమితి నిర్వాహకులు సింగారం శ్రీనివాస్,సింగారం నివాస్,ప్యాట జయ శ్రీకాంత్, కౌన్సిలర్ అశోక్,బర్మాలి జంగయ్య,వంశీకృష్ణ,గంధం శ్రీను,రమేష్,మహేష్ పంతులు, మేడిగ దామోదర్ తదితరులతో కలిసి కార్యక్రమ ప్రాంగణాన్ని సందర్శించి ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి పర్యవేక్షించారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

గత కొన్ని సంవత్సరాలుగా సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ ధార్మిక కార్యక్రమం హిందూ సమాజంలో భక్తిభావాన్ని, ధార్మిక చైతన్యాన్ని పెంపొందించడంలో విశేష ప్రాధాన్యత సంతరించుకుందని పేర్కొన్నారు.

నాలుగు రోజుల పాటు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు,

నవంబర్ 26:శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవం, 27: శివపార్వతుల కల్యాణోత్సవం, 28 శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం. 29:అయ్యప్ప స్వామి పడిపూజ..ఈ నాలుగు రోజుల వేడుకల్లో ఆధ్యాత్మిక వేత్తలు,ప్రముఖులు,వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొననున్నారు.

హిందూ ధర్మం,సంస్కృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి

ఈ సందర్భంగా నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, నేటి సమాజంలో తగ్గుతున్న నైతిక విలువలను పునరుద్ధరించుకోవడం,సనాతన ధర్మం,భారతీయ సంస్కృతి,సంప్రదాయాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఇలాంటి సామూహిక ధార్మిక కార్యక్రమాలు హిందూ సమాజంలో ఐక్యతను పెంపొందించడంతో పాటు అన్ని వర్గాల ప్రజలను ఒకే వేదికపైకి తీసుకువస్తాయని పేర్కొన్నారు.ఆధ్యాత్మిక ప్రవచనాలు, స్వామివారి కల్యాణోత్సవాలు, ప్రత్యేక పూజల ద్వారా హిందూ ధర్మం గొప్పతనాన్ని, మన సంప్రదాయాల విశిష్టతను తెలుసుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. మహిళలు,యువత,కుటుంబ సభ్యులు సంప్రదాయ వస్త్రధారణతో కుటుంబ సమేతంగా హాజరై కార్తీక మాస ఆధ్యాత్మిక వైభవంలో భాగస్వాములు కావాలని కోరారు.


నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి సహకారం మాకు ఎంతో ప్రోత్సాహం..

ఈ సందర్భంగా ఉత్సవ సమితి నిర్వాహకులు మాట్లాడుతూ, నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మొదటి నుంచి తమ కార్యక్రమానికి ప్రతి సంవత్సరం ప్రోత్సాహం అందిస్తూ,అవసరమైన మార్గదర్శకత్వం,సహకారం అందిస్తున్నారని తెలిపారు.నిత్యం వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు,ధార్మిక సంస్థలకు అండగా నిలుస్తూ హిందూ చైతన్యం కోసం నిరంతరం కృషి చేస్తున్నారనికొనియాడారు.కార్తీక కోటి దీపోత్సవ ఏర్పాట్లను ముందుగానే స్వయంగా వచ్చి పరిశీలించడం నిర్వాహకులుగా తమకు ఎంతో ప్రోత్సాహాన్ని, ఉత్సాహాన్ని అందించిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజలను,అన్ని రాజకీయ పార్టీల నాయకులను, ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులను, హిందూ బంధువులందరినీ మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నామని తెలిపారు. గత సంవత్సరాల కంటే ఈ ఏడాది మరింత పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కోటి దీపోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఇన్‌స్టామార్ట్‌లో నాసిరకం ఆహార పదార్థాలు

గుడ్లు కొంటే.. కుళ్లిన గుడ్లు సరఫరా
ఫిర్యాదు చేసినా పట్టించుకోని సిబ్బంది
మల్లాపూర్ కార్యాలయంలో నిర్లక్ష్య సమాధానాలు
టీజీ ఫాస్ట్‌కు ఫిర్యాదు చేసినా స్పందన కరువు
ఫుడ్ సేఫ్టీ అధికారుల బాధ్యత ఎక్కడ.?

హైదరాబాద్, (ప్రజావినికిడి):







ఆన్‌లైన్‌లో నిత్యావసర సరుకులు కొనుగోలు చేస్తున్న వినియోగదారులకు నాణ్యమైన వస్తువులు అందించాల్సిన బాధ్యతను ప్రముఖ ఆన్‌లైన్ సరుకుల సరఫరా సంస్థలు విస్మరిస్తున్నాయా.? వేగంగా సరుకులు అందిస్తున్నామనే ప్రచారంతో వినియోగదారుల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నాయా.? ఇన్‌స్టామార్ట్‌లో గుడ్లు కొనుగోలు చేసిన ఓ వినియోగదారుడికి పాడైపోయిన గుడ్లు సరఫరా కావడం ఈ ప్రశ్నలకు తావిస్తోంది. నిత్యావసర వస్తువుల పేరుతో నాసిరకం ఆహార పదార్థాలను అంటగడుతున్నారంటూ బాధిత వినియోగదారుడు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తనకు సరఫరా చేసిన గుడ్లు పాడైపోయిన విషయాన్ని గుర్తించిన వినియోగదారుడు సంబంధిత సంస్థకు ఫిర్యాదు చేయడంతో పాటు మల్లాపూర్‌లో ఉన్న ఇన్‌స్టామార్ట్ కార్యాలయానికి స్వయంగా వెళ్లి సిబ్బందికి సమస్యను వివరించినట్లు తెలిపారు. అయితే వినియోగదారుడి సమస్యను పరిష్కరించాల్సిన సిబ్బంది కనీస స్పందన కూడా చూపలేదని ఆరోపించారు. పైగా ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి.. మాకు సంబంధం లేదన్న ధోరణిలో సమాధానమిస్తూ చేతులెత్తేశారని వాపోయారు.

ప్రజల అవసరాలే వ్యాపారమా.?

వినియోగదారులు తమపై నమ్మకంతో ఆన్‌లైన్‌లో సరుకులు కొనుగోలు చేస్తుంటే, వారికి నాణ్యత లేని ఆహార పదార్థాలు సరఫరా చేయడం ఎంతవరకు సమంజసమని బాధితుడు ప్రశ్నిస్తున్నారు. ప్రజల నిత్యావసరాలను వ్యాపార అవకాశాలుగా మార్చుకుంటూ, వినియోగదారుల ఆరోగ్యం, హక్కులను గాలికి వదిలేస్తున్నారని మండిపడుతున్నారు.

పాడైన గుడ్లను ఆహారంగా వినియోగిస్తే అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

టీజీ ఫాస్ట్‌కు ఫిర్యాదు.. అయినా స్పందనేదీ.?

ఈ వ్యవహారంపై టీజీ ఫాస్ట్‌కు కూడా ఫిర్యాదు చేసినప్పటికీ సంబంధిత అధికారుల నుంచి కనీస స్పందన రాలేదని బాధితుడు ఆరోపిస్తున్నారు. ఆహార భద్రతపై ఫిర్యాదులు అందినప్పుడు తక్షణమే స్పందించి తనిఖీలు నిర్వహించాల్సిన అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

ఫుడ్ సేఫ్టీ అధికారుల పర్యవేక్షణ ఏది.?

జీహెచ్ఎంసీ పరిధిలో ఆహార పదార్థాల నాణ్యతను పర్యవేక్షించాల్సిన ఫుడ్ సేఫ్టీ అధికారులు క్షేత్రస్థాయిలో ఎంతవరకు విధులు నిర్వహిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఆహార భద్రత తనిఖీలు కాగితాలకే పరిమితమవుతున్నాయా.? వినియోగదారుల ఫిర్యాదులకు విలువ లేదా.? అధికారుల నిర్లక్ష్యానికి తోడు కొందరు సిబ్బంది లంచాలకు అలవాటుపడ్డారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అందుకే జీహెచ్ఎంసి పరిధిలో విద్యను నిర్మించే ఫుడ్ ఇన్స్పెక్టర్లు పూర్తి బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని కమిషనర్ కు ఫిర్యాదు చేసిన దిక్కు లేదన్న ఆవేదన ప్రజల వ్యక్తం చేస్తున్నారు కమిషనర్ల నిర్లక్ష్యంతోనే పుట్టి ఇన్స్పెక్టర్లు లంచాలకు అలవాటుపడి ప్రజల ఆరోగ్యంతో చెలగాడ మాడుతున్నారని ప్రజలు మండిపడుతున్నారు.

ఉన్నతాధికారులు స్పందించేది ఎప్పుడో.?

ఇన్‌స్టామార్ట్ సంస్థ సరఫరా చేసిన గుడ్ల నాణ్యతపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వినియోగదారుడు డిమాండ్ చేస్తున్నారు. మల్లాపూర్ కార్యాలయంలో ఫిర్యాదుదారుడితో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై కూడా విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. టీజీ ఫాస్ట్,ఫుడ్ సేఫ్టీ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి నగరవ్యాప్తంగా ఆన్‌లైన్ ఆహార సరఫరా సంస్థల గోదాములు, నిల్వ కేంద్రాలు, సరుకుల నాణ్యతపై తనిఖీలు చేపట్టాలి. వినియోగదారుల ఆరోగ్యంతో చెలగాటమాడితే కఠిన చర్యలు తప్పవనే సంకేతాలు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

వినియోగదారుడికి నాణ్యమైన ఆహారం అందించడం వ్యాపార సంస్థల బాధ్యత.ఆ హక్కును కాపాడటం ప్రభుత్వ అధికారుల బాధ్యత.మరి ఈ బాధ్యతను గుర్తు చేసేది ఎవరు.? అధికారుల బాధ్యతారాహిత్యాన్ని ప్రశ్నించేది ఎవరు.?

హైదరాబాద్ కు బాంబు బెదిరింపులు.. అప్రమత్తమైన పోలీస్ శాఖ

హైదరాబాద్‌లో బాంబు దాడులు చేస్తామంటూ బెదిరింపు ఈమెయిల్
నగరవ్యాప్తంగా ముమ్మరంగా యాంటీ సబోటేజ్ తనిఖీలు
వదంతులు నమ్మవద్దని నగర సీపీ విజ్ఞప్తి
నిందితుల కోసం సైబర్ క్రైమ్ పోలీసుల ముమ్మర గాలింపు
అనుమానం వస్తే వెంటనే 112 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచన

నవంబర్ 22 (ప్రజావినికిడి):



హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో బాంబు దాడులు జరపనున్నట్లు వచ్చిన ఒక బెదిరింపు ఈమెయిల్‌పై హైదరాబాద్ సిటీ పోలీసులు అత్యంత వేగంగా స్పందించారు. ఈమెయిల్ అందిన వెంటనే నగరవ్యాప్తంగా విస్తృత స్థాయిలో ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు. నగర ప్రజల భద్రతకు ఎలాంటి ఢోకా లేదని, ఎవరూ భయాందోళనలకు గురికావద్దని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు.

ఈ హెచ్చరికల నేపథ్యంలో నగరంలోని అనుమానిత, రద్దీ ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా యాంటీ సబోటేజ్ తనిఖీలు నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పోలీసుల గస్తీని, విజిబుల్ పోలీసింగ్‌ను మరింత ముమ్మరం చేశారు. కీలక కూడళ్లు, ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగించే ప్రాంతాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేసి అనుమానితులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.

మరోవైపు, ఈ బెదిరింపు ఈమెయిల్ ఎక్కడి నుంచి వచ్చింది, ఎవరు పంపారు అనే వివరాలను రాబట్టేందుకు నగర సైబర్ క్రైమ్ పోలీసులు రంగంలోకి దిగారు. డిజిటల్ ఆధారాలు, ఐపీ అడ్రస్‌లను విశ్లేషిస్తూ నిందితులను గుర్తించి పట్టుకునేందుకు ముమ్మర దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

సోషల్ మీడియాలో గానీ, బయట గానీ వచ్చే నిరాధారమైన వదంతులను ఎవరూ నమ్మవద్దని, వాటిని ఇతరులకు ఫార్వర్డ్ చేసి భయాందోళనలు సృష్టించవద్దని నగర ప్రజలకు సీపీ విజ్ఞప్తి చేశారు. నగరంలో ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నట్లు గమనించినా, లేదా గుర్తుతెలియని బ్యాగులు, వస్తువులు కనిపిస్తే వెంటనే డయల్ '112' ద్వారా సమాచారం అందించాలని సూచించారు. హైదరాబాద్ పోలీస్ విభాగం 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని, ప్రతి ఒక్కరి రక్షణకు కట్టుబడి ఉందని అధికారులు భరోసా ఇచ్చారు.


ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

వికారాబాద్‌లో చిరుత కలకలం.. రైతుపై దాడికి యత్నం..



వికారాబాద్ జిల్లా, నవంబర్ 22 : పరిగి మండలం నస్కల్ శివారులో ఓ రైతుపై చిరుతపులి దాడికి యత్నించడం తీవ్ర కలకలం రేపుతోంది. కృష్ణ అనే రైతు తన పొలం వద్ద పశువులను మేపుతుండగా చిరుతపులి దాడికి యత్నించింది. దీంతో తీవ్ర భయాంభ్రాంతులకు గురైన రైతు వెంటనే కేకలు వేస్తూ పరుగులు తీశాడు. సమీప పొలాల్లో ఉన్న రైతుల వద్దకు చేరుకుని కుప్పకూలిపోయాడు. దీనిని గమనించిన తోటి రైతులు వెంటనే బాధితుడిని ఆస్పత్రికి తరలించారు. పరిగిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు.సమాచారం అందుకున్న పోలీసులు, అటవీ శాఖ అధికారులు హుటాహుటిన నస్కల్ గ్రామానికి చేరుకున్నారు. చిరుతపులి సంచారంపై ఆరా తీస్తున్నారు. గ్రామస్థులు, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. కాగా, అక్టోబర్ 22న ఓ రైతుకు చెందిన లేగదూడపై గుర్తుతెలియని జంతువు దాడి చేసింది. మరోవైపు, రెండు మూడు రోజులుగా దోమ మండలం దిర్సంపల్లి సమీపంలోనూ చిరుత సంచరిస్తోంది. దీంతో స్థానికులు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. చిరుతపులిని త్వరగా పట్టుకోవాలని రైతులు, రైతు కూలీలు, ఆయా గ్రామాల ప్రజలు అటవీ శాఖ అధికారులను కోరుతున్నారు.

హైదరాబాద్‌లో వీకెండ్ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు.. ఒక్కరోజే 288 మందిపై కేసులు



హైదరాబాద్, నవంబరు 22: నగరంలోని సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఒక్కరోజు చేపట్టిన ఈ ప్రత్యేక తనిఖీల్లో మొత్తం 288 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వీరిలో 241 మంది బైక్ రైడర్లు, 12 మంది ఆటో డ్రైవర్లు, 34 మంది కార్ డ్రైవర్లు, ఒక హెవీ వెహికల్ డ్రైవర్ ఉన్నారు. బీఏసీ పరీక్షల్లో 231 మందికి 36 నుంచి 200 ఎంజీ, 37 మందికి 201 నుంచి 300 ఎంజీ, మరో 20 మందికి 301 నుంచి 550 ఎంజీ వరకు ఆల్కహాల్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పట్టుబడిన 288 మందిని కోర్టులో హాజరుపరచేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు.మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. ముఖ్యంగా మద్యం మత్తులో డ్రైవింగ్ చేసి ప్రమాదాలకు కారణమై ప్రాణనష్టం కలిగిస్తే భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 105 కింద కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. గత వారం రోజుల్లో డ్రంక్ అండ్ డ్రైవ్‌కు సంబంధించిన 218 కేసులను కోర్టులు పరిష్కరించినట్లు వెల్లడించారు. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, మద్యం సేవించిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపవద్దని పోలీసులు సూచించారు.

కోయిల్‌సాగర్ నీటిని కొడంగల్‌కు తరలిస్తే సహించేది లేదు : మాజీ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి



హైదరాబాద్, నవంబరు 22:కోయిల్‌సాగర్ నీటిని కొడంగల్‌కు తరలిస్తే సహించేది లేదు అని మాజీ ఎమ్మెల్యే ఎస్. రాజేందర్ రెడ్డి హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ కోసం రెండు జిల్లాల్లో నీళ్ల చిచ్చుపెట్టారు. కొడంగల్ నియోజకవర్గానికి తాగునీటి అవసరాల కోసం ఏకంగా రూ.490 కోట్లతో ప్రత్యేక పైప్‌లైన్ కోసం గుట్టుగా పరిపాలన అనుమతులు మంజూరు కావడం పాలమూరు జిల్లా లో ప్రకంపనలు సృష్టిస్తున్నది.ఈ నేపథ్యంలో ఆదివారం ఆయన మీడియా సమావేశంలో రాజేందర్ రెడ్డి మాట్లాడారు. నారాయణపేట, దేవరకద్ర రైతుల ప్రయోజనాలను దెబ్బతీయొద్దన్నారు. మూడు రోజుల్లో నీటి తరలింపు ప్రక్రియను నిలిపివేస్తున్నట్లు ప్రకటించాలి. లేదంటే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు

యాదగిరిగుట్టకు పోటెత్తిన భక్తజనం.. ధర్మ దర్శనానికి 3 గంటల సమయం



యాదాద్రి భువనగిరి: కార్తీకమాసం.. ఆదివారం సెలవు కలిసిరావడంతో యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. స్వామివారి దర్శనం కోసం ఉదయం నుంచే భక్తులు భారీ సంఖ్యలో భక్తులు పోటెత్తారు. భక్తులు తరలిరావడంతో కొండపై, క్యూలైన్లలో సందడి నెలకొంది. ధర్మ దర్శనానికి సుమారు మూడు గంటల సమయం పడుతుండటంతో భక్తులు వేచి ఉండాల్సి వచ్చింది.రద్దీ కారణంగా కొండపైకి వెళ్లే మార్గంలో వాహనాలు బారులు తీరాయి. రద్దీకి అనుగుణంగా ఎస్పీఎఫ్ సిబ్బంది వాహనాలను కొండపైకి అనుమతిస్తున్నారు. క్యూలైన్లు, ఆలయ పరిసరాలు భక్తులతో నిండిపోయాయి.

కార్తీకమాసం సందర్భంగా సత్యనారాయణస్వామి వ్రత మండపంలోనూ భక్తుల రద్దీ కొనసాగింది. పెద్ద సంఖ్యలో భక్తులు వ్రతాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. కొండపైన దీపారాధన చేసి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు.

సెలవు రోజు కావడంతో యాదాద్రిలో భక్తుల సందడి కనిపించింది.

సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్సీ దాసోజ్ శ్రవణ్ కుమార్ బహిరంగ లేఖ

హైదరాబాద్, నవంబరు 22: తెలంగాణ విద్యార్థుల స్థానికత హక్కులను కాలరాయొద్దని, స్వార్థపూరిత ఇంటర్మీడియట్ రద్దు నిర్ణయాన్ని నిలిపివేయాలని కోరుతూ ఎమ్మెల్సీ దాసోజ్ శ్రవణ్ కుమార్ సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు.ఇంటర్మీడియట్‌ను రద్దు చేసి 9 నుండి 12వ తరగతి వరకు ఒకే బడిగా మారిస్తే తెలంగాణ విద్యార్థుల స్థానికతపై రేవంత్ ప్రభుత్వం దాడి చేసినట్లేనని ఆయన లేఖలో పేర్కొన్నారు. నాలుగేళ్ల కార్పొరేట్ హాస్టల్ ప్యాకేజీ కొంటే ఇతర రాష్ట్రాల విద్యార్థులు సైతం చట్టబద్ధంగా 'తెలంగాణ లోకల్' అయిపోయి, మన బిడ్డల మెడికల్, ఇంజనీరింగ్ సీట్లు తన్నుకుపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.లోకల్ హోదా పుట్టుకతో కాకుండా ప్రవేశ పరీక్షకు ముందు వరుసగా 4 ఏళ్లు ఎక్కడ చదివారనే దానిపైనే ఆధారపడి ఉంటుందని లేఖలో



దాసోజ్ శ్రవణ్ కుమార్ స్పష్టం చేశారు. తెలంగాణ విద్యార్థుల భవిష్యత్తును శాశ్వతంగా దెబ్బతీసే ఈ చట్టపరమైన ఇంటర్మీడియట్ రద్దు ప్రమాదాన్ని నివారించాలని లేఖలో కోరారు.ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు, తల్లిదండ్రులతో కనీస చర్చ లేకుండా తీసుకున్న ఇంటర్మీడియట్ రద్దు నిర్ణయం వెనుక కార్పొరేట్ కాలేజీల ప్రయోజనాలున్నాయని ఆరోపించారు. నవంబర్ 13న రాసిన తాను బహిరంగ లేఖపై వారం గడిచినా ప్రభుత్వం నుండి ఒక్క సమాధానం కూడా రాలేదని, కార్పొరేట్ సంస్థలకు లాభం చేకూర్చే ఇంటర్మీడియట్ రద్దు నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ఎమ్మెల్సీ దాసోజ్ శ్రవణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ విషయమై దాసోజు శ్రవణ్ కుమార్ సుదీర్ఘ అంశాలను ప్రస్తావించారు.

సీతారామ కాలువ పనులను అడ్డుకున్న కమలాపురం రైతులు

కారేపల్లి, నవంబర్ 22: సీతారామ ప్రాజెక్టు కాలువ నిర్మాణ పనులను ఖమ్మం జిల్లా సింగరేణి మండలం కమలాపురం రైతులు ఆదివారం అడ్డుకున్నారు. భూసేకరణకు సంబంధించి 2021లో నిర్ణయించిన పరిహారం కాకుండా, ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రస్తుతం సాగులో ఉన్న వరి, పత్తి పంటలు చేతికొచ్చే వరకు కాలువ పనులు చేపట్టవద్దని పట్టుబట్టారు.సీతారామ ప్రాజెక్టు కాలువ నిర్మాణం కోసం కమలాపురానికి చెందిన సుమారు 45 మంది రైతుల 54 ఎకరాల భూమిని 2021లో అధికారులు సేకరించి పరిహారం అవార్డు ప్రకటించారు. ఎకరానికి రూ.10.50 లక్షల చొప్పున పరిహారం నిర్ణయించినప్పటికీ, చాలాకాలం డబ్బులు అందకపోవడంతో రైతులు ఆ భూముల్లో సాగు కొనసాగించారు. ఈ ఏడాది ఆగస్టు 25న పరిహారం మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వారు తెలిపారు. అయితే, అప్పటికే భూముల్లో వరి, పత్తి పంటలు సాగు చేయగా ప్రస్తుతం అవి దిగుబడికి వచ్చాయి. ఈ సమయంలో కాలువ నిర్మాణానికి కాంట్రాక్టర్ జేసీబీ యంత్రాలను తీసుకురావడంతో రైతులు అడ్డుకున్నారు. 2021లో నిర్ణయించిన పరిహారం కాకుండా 2026 మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఇదే ప్రాజెక్టు పరిధిలోని మరో మండల రైతులకు ఎకరానికి రూ.19.25 లక్షల పరిహారం ప్రకటించారని, తమకు మాత్రం తక్కువ మొత్తం చెల్లించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు కూడా సమాన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంటలు పూర్తిగా కోసుకునే వరకు కాలువ నిర్మాణ పనులు నిలిపివేయాలని రైతులు స్పష్టం చేశారు. పంట చేతికొచ్చే దశలో పనులు చేపడితే తీవ్రంగా నష్టపోతామని పేర్కొన్నారు.



ఆదేశాలు రాలేదు.. పనులు చేపడతాం

భూముల పరిహారం విషయంలో రైతులు కోర్టును ఆశ్రయించారని నీటిపారుదల శాఖ ఏఈ సందీప్ తెలిపారు. 54 ఎకరాల భూమిని రెవెన్యూ శాఖ తమ శాఖకు అప్పగించిందని, ఈ ఏడాది ఆగస్టులో ప్రభుత్వం పరిహారం రైతుల ఖాతాల్లో జమ చేసిందని వివరించారు. పరిహారం సరిపోలేదని రైతులు కోర్టును ఆశ్రయించినప్పటికీ, తమకు ఎలాంటి ఆదేశాలు అందలేదన్నారు. అందుకే కాలువ నిర్మాణ పనులు చేపట్టేందుకు సిద్ధమయ్యామని తెలిపారు. రైతులు సాగు చేసిన పంటలు పూర్తిగా చేతికొచ్చే వరకు ఖాళీగా ఉన్న భూముల్లో పనులు కొనసాగిస్తామని పేర్కొన్నారు. పనులను అడ్డుకునే అధికారం రైతులకు లేదని, యంత్రాలను నిలిపివేయడం వల్ల ప్రభుత్వానికి నష్టం జరుగుతుందని అన్నారు. పరిహారం విషయంలో తమకు అన్యాయం జరిగిందని రైతులు ఆందోళన చేస్తుండగా, పనులు చేపట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. దీంతో కమలాపురంలో సీతారామ కాలువ భూసేకరణ వ్యవహారం ఉద్రిక్తంగా మారింది.

హైదరాబాద్ ఔటర్ పరిధిలో 720 ఎస్టీపీలు.. పనిచేస్తున్నవి 30 శాతమే.. ఎస్టీపీలపై హైడ్రా కొరడా

హైదరాబాద్, నవంబరు 22:హైదరాబాద్‌లోని గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లలో మురుగునీటి శుద్ధి కేంద్రాల పనితీరుపై హైడ్రా దృష్టి సారించింది. ఔటర్ పరిధిలో గుర్తించిన 720 ఎస్టీపీల్లో కేవలం 30 శాతం మాత్రమే పనిచేస్తున్నట్లు తనిఖీల్లో వెల్లడైంది. పూర్తిస్థాయిలో శుద్ధి చేస్తున్నవి పదిలోపే ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. నల్లగండ్లలో ఓ ఎస్టీపీని పరిశీలించిన కమిషనర్ రంగనాథ్ నమూనాలను పీసీబీకి పంపారు. ఎస్టీపీల పనితీరును గుర్తించేందుకు ప్రత్యేక విద్యుత్తు మీటర్ల ఏర్పాటుపైనా కసరత్తు జరుగుతోంది. క్రమంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శుక్రవారం నల్లగండ్లలోని ఓ గేటెడ్ కమ్యూనిటీలో ఏర్పాటు చేసిన ఎస్టీపీని పరిశీలించారు. అక్కడి నుంచి శుద్ధి చేసిన నీటి నమూనాలను సేకరించి, పరీక్షల కోసం కాలుష్య నియంత్రణ మండలి ప్రయోగశాలకు పంపించారు. నమూనాల పరీక్షల ద్వారా ఎస్టీపీ పనితీరు, నీటిలో కాలుష్య స్థాయిలను అంచనా వేయనున్నారు. మరోవైపు అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల్లో ఎస్టీపీలు నిజంగా పనిచేస్తున్నాయా లేదా అన్నది నిర్ధారించేందుకు ప్రత్యేక విద్యుత్తు మీటర్లను ఏర్పాటు చేయాలని విద్యుత్తుశాఖ యోచిస్తోంది. ఈ మీటర్ల ద్వారా ఎస్టీపీలకు విద్యుత్తు సరఫరా, వినియోగాన్ని పర్యవేక్షించే అవకాశం ఉంటుంది.ప్రస్తుతం నగరంలో మురుగునీటి శుద్ధి, పునర్వినియోగంపై జలమండలి ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. డిసెంబరు నుంచి ఐటీ కారిడార్ పరిధిలోని



ప్రాంతాలతో పాటు జూబ్లీహిల్స్, పటాన్‌చెరు వరకు తాగునీటి సరఫరాలో 20 నుంచి 30 శాతం మేర కోత విధించాల్సిన పరిస్థితి తలెత్తవచ్చని అంచనా వేస్తు న్నారు. ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో రెండ్రోజులకోసారి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎస్టీపీల నుంచి పునర్వినియోగానికి అనువైన నీరు రోజుకు కేవలం 7 ఎంఎల్‌డీ మాత్రమే ఉత్పత్తి అవుతోంది. దీంతో ప్రైవేటు ఎస్టీపీల పనితీరును మెరుగుపర చడంపై జలమండలి దృష్టి సారించింది.జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ రికార్డుల ప్రకారం ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో మొత్తం 720 ఎస్టీపీలు ఉన్నట్లు గుర్తించారు. కార్పొరేషన్ల అధికారులు నిర్వహించిన తనిఖీల్లో వీటిలో కేవలం 30 శాతం మాత్రమే పనిచేస్తున్నట్లు తేలింది. పనిచేస్తున్నట్లు కనిపిస్తున్న కేంద్రాల్లోనూ మురుగునీరు పూర్తిస్థాయిలో శుద్ధి కావడం లేదని అధికారులు గుర్తించారు. నిబంధనలకు అనుగుణంగా పందశాతం శుద్ధి చేస్తున్న ఎస్టీపీలు పదిలోపే ఉన్నట్లు అంచనా వేశారు. దీంతో ప్రైవేటు ఎస్టీపీల నిర్వహణపై పర్యవేక్షణ పెంచాల్సిన అవసరం ఏర్పడింది.ఇటీవల హైడ్రా కమిషనర్ తనిఖీ చేసిన ఓ ప్రైవేటు ఎస్టీపీ నుంచి బయటకు విడుదలవుతున్న నీటిలో మలం, ఆహార వ్యర్థాల ఆనవాళ్లు కనిపించాయి. దీనిని బట్టి మరుగుదొడ్ల నుంచి వచ్చే వ్యర్థాలను ప్రత్యేక పైపులైన్ల ద్వారా ఎస్టీపీలకు మళ్లించకుండా నేరుగా నాలాలు, కాలువల్లోకి పంపిస్తున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. వంటగది, స్నానాల గదులు, ఇతర అవసరాల నుంచి వచ్చే నీటిని మాత్రమే ఎస్టీపీలకు తరలించి, దానిని కూడా సరిగా శుద్ధి చేయకుండా రికార్డుల్లో మాత్రం కేంద్రాలు పనిచేస్తున్నట్లు చూపిస్తున్నట్లు తనిఖీల్లో వెల్లడైంది.నగరంలో నీటి కొరత పెరుగుతున్న నేపథ్యంలో మురుగునీటిని శుద్ధి చేసి తిరిగి వినియోగించడం కీలకంగా మారింది. పార్కుల నిర్వహణ, మొక్కల పెంపకం, నిర్మాణ అవసరాలు, ఇతర తాగునీటేతర అవసరాలకు శుద్ధి చేసిన నీటిని వినియోగించుకోవచ్చు. అయితే ప్రైవేటు ఎస్టీపీలు సక్రమంగా పనిచేయకపోతే ఒకవైపు నీటి వృథా, మరోవైపు కాలువలు, చెరువులు కలుషితమయ్యే ప్రమాదం ఉంటుంది. అందువల్ల హైడ్రా తనిఖీలు, పీసీబీ పరీక్షలు, విద్యుత్తు వినియోగ పర్యవేక్షణ ద్వారా ఎస్టీపీల నిర్వహణలో పారదర్శకత తీసుకురావడం కీలకంగా మారనుంది.

తెలంగాణలో 13 ఏళ్ల తర్వాత కొత్త పీఏసీఎస్‌లు.. 32 జిల్లాల్లో 240 సహకార సంఘాలు..!

హైదరాబాద్, నవంబరు 22:తెలంగాణలో 13 ఏళ్ల తర్వాత కొత్త ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించింది. హైదరాబాద్ మినహా 32 జిల్లాల్లో 240 కొత్త పీఏసీఎస్‌లు ఏర్పాటు చేయనున్నారు. తొలుత 500 సంఘాలకు ప్రతిపా దనలు వచ్చినప్పటికీ పరిపాలనా సౌలభ్యం, ప్రాంతీయ సమతూకం దృష్ట్యా 240కి ఆమోదం తెలిపారు. నల్గొండలో అత్యధికంగా 23, మేడ్చల్–మల్కాజిగిరిలో ఒక్క సంఘం ఏర్పాటు కానుంది. జనవరిలో వీటిని ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది.తెలంగాణలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దాదాపు 13 ఏళ్ల విరామం తర్వాత కొత్త సహకార సంఘాల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేసింది. హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాల్లో కొత్తగా 240 పీఏసీఎస్‌లను ప్రారంభించేందుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. వచ్చే జనవరిలో కొత్త సంఘాలను ప్రారంభించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 908 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉండగా.. వీటన్నింటినీ 2013కు ముందే ఏర్పాటు చేశారు. ఆ తర్వాత కొత్త సంఘాల ఏర్పాటు జరగలేదు. తాజాగా తీసుకున్న నిర్ణయంతో గ్రామీణ ప్రాంతాల్లో సహకార వ్యవస్థ మరింత విస్తరించనుంది.కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన సహకార విధానంలో భాగంగా దేశవ్యాప్తంగా ప్రతి గ్రామంలో సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించింది. వ్యవసాయ రంగానికి అవసరమైన రుణాలు, ఎరువులు, విత్తనాలు, ఇతర సేవలను రైతులకు స్థానికంగానే అందుబాటులోకి తీసుకురావడం ఈ విధానం ప్రధాన ఉద్దేశం. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కూడా కొత్త పీఏసీఎస్‌ల ఏర్పాటుపై దృష్టి సారించింది. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 500 సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని తొలుత ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అయితే



పరిపాలనా సౌలభ్యం, ఇప్పటికే ఉన్న సంఘాల పరిధి, ప్రాంతాల మధ్య సమతూకం తదితర అంశాలను పరిశీలించిన అనంతరం తొలి విడతలో 240 సంఘాల ఏర్పాటుకు మాత్రమే అనుమతించింది.

కొత్తగా ఏర్పాటు చేయనున్న 240 సంఘాల్లో జిల్లాల వారీగా నల్గొండకు అత్యధిక ప్రాధాన్యం లభించింది. అక్కడ 23 కొత్త పీఏసీఎస్‌లు ఏర్పాటు కానున్నాయి. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో అత్యల్పంగా ఒక్క సంఘానికే అనుమతి లభించింది. హైదరాబాద్ జిల్లాను ఈ జాబితా నుంచి మినహాయించారు. మిగిలిన జిల్లాల్లో స్థానిక అవసరాలు, రైతుల సంఖ్య, భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా కొత్త సంఘాలను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించిన పరిపాలనా ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వం సూచించింది.పీఏసీఎస్‌లు గ్రామీణ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తాయి. రైతులకు స్వల్పకాలిక పంట రుణాలు అందించడం, ఎరువులు, విత్తనాల పంపిణీ, వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు, ప్రభుత్వ వ్యవసాయ పథకాల అమలులో సహకరించడం వంటి బాధ్యతలను నిర్వహిస్తాయి. కొత్త సంఘాలు ఏర్పాటైతే ప్రస్తుతం ఉన్న సహకార సంఘాలపై పని భారం తగ్గడంతోపాటు రైతులకు సేవలు మరింత చేరువయ్యే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా మారుమూల గ్రామాల్లోని రైతులు రుణాలు, వ్యవసాయ అవసరాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి తగ్గనుంది. అయితే కొత్త సంఘాల ఏర్పాటుతోపాటు వాటికి అవసరమైన సిబ్బంది, కార్యాలయాలు, ఆర్థిక వనరులు సమకూర్చడం కూడా కీలకం కానుంది. జనవరిలో ప్రారంభించాలన్న ప్రభుత్వ లక్ష్యం మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేస్తే తెలంగాణలో సహకార వ్యవస్థకు కొత్త విస్తరణ లభించనుంది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

భారత్-ఎపై పాకిస్థాన్-ఎ ఘన విజయం



దోహా: ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ 2026 టోర్నీలో భాగంగా భారత్-ఎ, పాకిస్థాన్-ఎ జట్ల మధ్య జరిగిన గ్రూప్-బి మ్యాచ్‌లో పాకిస్థాన్-ఎ జట్టు 48 పరుగుల తేడాతో విజయం సాధించింది. నవంబర్ 22న దోహాలోని వెస్ట్ ఎండ్ పార్క్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈ మ్యాచ్ జరిగింది.తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్-ఎ జట్టు 49.2 ఓవర్లలో 313 పరుగులకు ఆలౌటైంది. ఆ జట్టు బ్యాటర్లలో హసన్ నవాజ్ 79 పరుగులతో అద్భుతంగా రాణించాడు. మాజ్ సదాఖత్ 59, ఫర్హాన్ యూసుఫ్ 56 పరుగులతో అర్ధ సెంచరీలు సాధించారు. షమైల్ హుస్సేన్ 33 పరుగులు చేశాడు.

314 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్-ఎ జట్టు 49.1 ఓవర్లలో 265 పరుగులకు ఆలౌటైంది. అభిషేక్ శర్మ 42 బంతుల్లో 70 పరుగులు చేసి ఆకట్టుకున్నాడు. అయితే మిగతా బ్యాటర్లు ఆశించిన స్థాయిలో రాణించలేకపోవడంతో భారత్‌కు ఓటమి తప్పలేదు. దీంతో పాకిస్థాన్-ఎ 48 పరుగుల తేడాతో విజయాన్ని అందుకుంది.

మ్యాచ్ వివరాలు:
- టోర్నీ: ఏసీసీ మెన్స్ ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ 2026
- మ్యాచ్: 8వ మ్యాచ్, గ్రూప్-బి
- పాకిస్థాన్-ఎ: 313/10 (49.2 ఓవర్లు)
- భారత్-ఎ: 265/10 (49.1 ఓవర్లు)
- ఫలితం: పాకిస్థాన్-ఎ 48 పరుగుల తేడాతో విజయం.

మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ ప్రదర్శన: హసన్ నవాజ్ (79 పరుగులు).

వరుసగా 4 బంతుల్లో 4 వికెట్లు..

అరంగేట్రంలోనే అదరగొట్టిన యువ పేసర్ జంషెడ్ ఆలం!

సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీలో ఓ యువ బౌలర్ తన అరంగేట్ర మ్యాచ్‌లోనే అద్భుతం చేశాడు. రైల్వేస్ జట్టుకు చెందిన 23 ఏళ్ల రైట్ ఆర్మ్ మీడియం పేసర్ జంషెడ్ ఆలమ్, వరుసగా నాలుగు బంతుల్లో నాలుగు వికెట్లు పడగొట్టి చరిత్ర సృష్టించాడు. ఈ ఘనత సాధించిన మూడో భారత బౌలర్‌గా అతను రికార్డుల్లోకి ఎక్కాడు.

ఇండోర్ వేదికగా సౌరాష్ట్రతో జరిగిన మ్యాచ్‌లో ఈ అరుదైన ఫీట్ నమోదైంది. తొలుత బ్యాటింగ్ చేసిన రైల్వేస్ జట్టు 5 వికెట్లకు 182 పరుగులు చేసింది. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన సౌరాష్ట్ర ఇన్నింగ్స్‌లో నాలుగో ఓవర్ వేసిన జంషెడ్ ఆలమ్, తన మ్యాజిక్‌ను ప్రదర్శించాడు.

ఆ ఓవర్‌లోని వరుస బంతుల్లో హార్విక్ దేశాయ్, ప్రేరక్ మన్కడ్, రుచిత్ అహిర్, సమ్మర్ గజ్జర్‌లను పెవిలియన్‌కు పంపాడు. ఆ తర్వాత తన తర్వాతి ఓవర్‌లో సిద్ధార్థ్ రానా వికెట్‌ను కూడా తీసి, కేవలం 9 బంతుల్లోనే 5 వికెట్ల ప్రదర్శన పూర్తి చేశాడు. దీంతో సౌరాష్ట్ర 30 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది.

టీ20ల్లో నాలుగు బంతుల్లో నాలుగు వికెట్లు తీసిన భారత బౌలర్లలో ఆలమ్ మూడోవాడు. గతంలో కర్ణాటకకు చెందిన అభిమన్యు మిథున్ (2019), విదర్భ బౌలర్ దర్శన్ నల్కండే (2021) ఈ ఘనత సాధించారు. అయితే, వాళ్లిద్దరూ ఇన్నింగ్స్ 20వ ఓవర్‌లో ఈ ఫీట్ సాధించగా, ఆలమ్ మ్యాచ్ ఆరంభంలోనే ఈ రికార్డు నెలకొల్పడం విశేషం. అంతేకాకుండా టీ20 అరంగేట్రంలో ఐదు వికెట్లు తీసిన ఆరో భారత బౌలర్‌గా కూడా ఆలమ్ నిలిచాడు.

ఈ మ్యాచ్‌లో ఆలమ్ మొత్తం 38 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. అతని ధాటికి సౌరాష్ట్ర 8 వికెట్లకు 153 పరుగులు మాత్రమే చేసి, 29 పరుగుల తేడాతో ఓటమిపాలైంది.



హర్షిత్ రాణా, మాజ్ సదాకత్ మధ్య మాటల యుద్ధం..

భారత్, పాక్ మ్యాచ్‌లో టెన్షన్..



భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య క్రికెట్ సమరం అంటేనే మైదానంలో భావోద్వేగాలు, తీవ్ర పోటీ వాతావరణం నెలకొంటుంది. ఏసీసీ మెన్స్ ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ 2026 టోర్నీలో భాగంగా జరిగిన ఇండియా 'ఎ', పాకిస్థాన్ 'ఎ' మ్యాచ్‌లో కూడా సరిగ్గా ఇదే తరహా ఉద్రిక్తత కనిపించింది. భారత పేస్ బౌలర్ హర్షిత్ రాణా, పాకిస్థాన్ బ్యాటర్ మాజ్ సదాకత్ మధ్య మైదానంలో చోటుచేసుకున్న తీవ్ర వాగ్వాదం మ్యాచ్ వాతావరణాన్ని ఒక్కసారిగా వేడెక్కించింది.

మ్యాచ్‌లో భాగంగా ఏడో ఓవర్ వేస్తున్న సమయంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. హర్షిత్ రాణా వేసిన స్లోయర్ డెలివరీని ఆడటంలో పాక్ బ్యాటర్ మాజ్ సదాకత్ తీవ్రంగా ఇబ్బంది పడ్డాడు. సరైన షాట్ ఆడలేకపోయిన సదాకత్ వైపు నడుచుకుంటూ వెళ్లిన హర్షిత్ రాణా, అతనిపై కొన్ని వ్యాఖ్యలు చేశాడు. ఆ తర్వాతి బంతిని రాణా షార్ట్ పిచ్‌గా సంధించగా, సదాకత్ ర్యాంప్ షాట్ ఆడేందుకు విఫలయత్నం చేశాడు. బంతి కనెక్ట్ కాకపోవడంతో రాణా మరింత దూకుడుగా బ్యాటర్‌తో మాటల యుద్ధానికి దిగాడు.ఆ తర్వాత నాలుగో బంతిని సదాకత్ బ్యాక్‌వర్డ్ పాయింట్ దిశగా ఆడి సింగిల్ తీశాడు. అయితే బ్యాటర్లు ఎండ్స్ మారుతున్న సమయంలో కూడా ఇద్దరి మధ్య వాగ్వాదం కొనసాగింది. ఇద్దరు ఆటగాళ్ల మధ్య ఎలాంటి మాటలు దొర్లాయనే వివరాలు కచ్చితంగా తెలియనప్పటికీ, మైదానంలో వారి ముఖ కవళికలు, హావభావాలు ఉద్రిక్తతను స్పష్టంగా ప్రతిబింబించాయి. ఆ ఓవర్‌లోనే తర్వాతి బంతుల్లో మరో పాక్ బ్యాటర్ షమీల్ హుస్సేన్‌కు బౌలింగ్ చేస్తున్నప్పుడు కూడా రాణా అదే దూకుడును ప్రదర్శించాడు.

హర్షిత్ రాణా మొదటి నుంచీ దూకుడైన బౌలింగ్ శైలికి, ప్రత్యర్థులను కవ్వించే స్వభావానికి పేరుగాంచాడు. హై-ప్రెజర్ వాతావరణంలో సాగే భారత్-పాక్ పోరులో రాణా ప్రదర్శించిన ఈ తీవ్రత మ్యాచ్‌లోని పోటీతత్వాన్ని మరింత పెంచింది. ఈ తరహా ఘర్షణలు దాయాదుల పోరుకు సహజమైన రసవత్తరతను తెచ్చిపెట్టినప్పటికీ, మాటల కంటే మైదానంలో ప్రదర్శించే నైపుణ్యం, తీసే వికెట్లే అసలైన ఫలితాన్ని నిర్దేశిస్తాయి.



వెల్లింగ్టన్ టెస్టులో పట్టు బిగించిన భారత్..

ఓటమి నుంచి గట్టెక్కేందుకు కివీస్ పోరాటం

భారత్‌తో జరుగుతున్న తొలి టెస్టులో న్యూజిలాండ్ జట్టు ఓటమి నుంచి గట్టెక్కేందుకు పోరాడుతోంది. వెల్లింగ్టన్‌లో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి కివీస్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 2 వికెట్ల నష్టానికి 119 పరుగులు చేసింది. డెవాన్ కాన్వే (59 బ్యాటింగ్), రచిన్ రవీంద్ర (27 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. భారత్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు న్యూజిలాండ్ ఇంకా 233 పరుగులు వెనుకంజలో ఉంది.రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన న్యూజిలాండ్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఇన్నింగ్స్ మొదటి ఓవర్‌లోనే కెప్టెన్ టామ్ లాథమ్‌ను జస్‌ప్రీత్ బుమ్రా పెవిలియన్ పంపాడు. ఆ తర్వాత హెన్రీ నికోల్స్ (31) నిలకడగా ఆడుతున్న సమయంలో ప్రసిద్ధ్ కృష్ణ బౌలింగ్‌లో ధ్రువ్ జురెల్ అద్భుతమైన క్యాచ్ పట్టడంతో ఔటయ్యాడు. ఈ దశలో కాన్వే హాఫ్ సెంచరీతో జట్టును ఆదుకున్నాడు.

అంతకుముందు, భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌ను 720/9 పరుగుల భారీ స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. న్యూజిలాండ్ గడ్డపై ఇదే అత్యధిక టెస్ట్ స్కోరు కావడం విశేషం. రిషభ్ పంత్ (128) అద్భుత సెంచరీతో చెలరేగాడు. దీంతో దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా (ఝుజుచీూ) దేశాల్లో సెంచరీ చేసిన ఆరో భారత బ్యాటర్‌గా పంత్ రికార్డు సృష్టించాడు. మ్యాచ్ గెలవాలంటే చివరి రోజు భారత్ 8 వికెట్లు తీయాల్సి ఉండగా, కివీస్ టెస్టును డ్రా చేసుకునేందుకు తీవ్రంగా శ్రమించాల్సి ఉంది.ం

వెల్లింగ్టన్‌లో పంత్ సెంచరీకి గవాస్కర్ స్టాండింగ్ ఒవేషన్..



టీమిండియా వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ మరోసారి తనదైన శైలిలో చెలరేగిపోయాడు. న్యూజిలాండ్‌తో వెల్లింగ్టన్‌లో జరుగుతున్న టెస్టు మ్యాచ్ నాలుగో రోజు పంత్ అద్భుతమైన సెంచరీ సాధించాడు. ఇది అతనికి టెస్టుల్లో తొమ్మిదో శతకం. ఈ సెంచరీతో పంత్ పలు అరుదైన రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు.ఇన్నింగ్స్‌లో భాగంగా గ్లెన్ ఫిలిప్స్ బౌలింగ్‌లో మిడ్-ఆఫ్ మీదుగా అద్భుతమైన సిక్సర్ బాది పంత్ తన సెంచరీని పూర్తి చేసుకున్నాడు. ఆ సమయంలో కామెంటరీ బాక్సులో ఉన్న భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్, పంత్ షాట్‌కు ముగ్ధుడై తన సీటులో నుంచి లేచి నిలబడి చప్పట్లతో అభినందించాడు. ఇందుకు సంబంధించిన వీడియోను సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ పంచుకుంది.

ఈ సెంచరీతో టెస్టుల్లో అత్యధిక శతకాలు సాధించిన వికెట్ కీపర్ల జాబితాలో పంత్ మూడో స్థానానికి ఎగబాకాడు. ఇంగ్లండ్‌కు చెందిన లెస్ అమెస్ (8 సెంచరీలు)ను అతను అధిగమించాడు. ఈ జాబితాలో ఆస్ట్రేలియా దిగ్గజం ఆడమ్ గిల్‌క్రిస్ట్ (17), జింబాబ్వే ఆటగాడు ఆండీ ఫ్లవర్ (12) మాత్రమే పంత్ కన్నా ముందున్నారు.అంతేకాకుండా 'సెనా' దేశాలైన దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా నాలుగింటిలోనూ టెస్టు సెంచరీ చేసిన తొలి ఆసియా వికెట్ కీపర్‌గా పంత్ చరిత్ర సృష్టించాడు. ప్రపంచవ్యాప్తంగా ఈ ఘనత సాధించిన మూడో వికెట్ కీపర్ కావడం విశేషం. ఈ మ్యాచ్‌లో పంత్ చేసిన శతకం, న్యూజిలాండ్‌పై భారత్ పట్టును మరింత బిగించేందుకు దోహదపడింది.



పాక్‌పై తిలక్ వర్మ శతక పోరాటం..

దోహా, నవంబర్ 23: చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగిన ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ 2026 టోర్నీలో భారత యువ జట్టు ఓటమి పాలైంది. భారత జట్టు కెప్టెన్ తిలక్ వర్మ అద్భుతమైన పోరాటంతో వరుసగా రెండో సెంచరీ సాధించినప్పటికీ జట్టుకు విజయాన్ని అందించలేకపోయాడు.

ఆదివారం దోహాలోని వెస్ట్ ఎండ్ పార్క్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరిగిన గ్రూప్-బి మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్-ఏ జట్టు 49.2 ఓవర్లలో 313 పరుగులకు ఆలౌటైంది.పాకిస్థాన్ బ్యాటర్లలో హసన్ నవాజ్ 79 పరుగులతో రాణించగా, మాజ్ సదాఖత్ 59, ఫర్హాన్ యూసఫ్ 56 పరుగులు సాధించారు.314 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్-ఏ జట్టుకు ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. అభిషేక్ శర్మ 42 బంతుల్లో 70 పరుగులు చేసి మెరుపులు మెరిపించినప్పటికీ మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు.ఒక దశలో 129 పరుగులకే కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన భారత్‌ను కెప్టెన్ తిలక్ వర్మ ఆదుకునే ప్రయత్నం చేశాడు. షాబాజ్ అహ్మద్‌తో కలిసి ఏడో వికెట్‌కు 112 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు.తిలక్ వర్మ 149 బంతుల్లో 100 పరుగులు సాధించాడు. ఇందులో ఏడు ఫోర్లు, ఒక సిక్స్ ఉన్నాయి. షాబాజ్ అహ్మద్ 56 పరుగులతో సహకరించాడు. అయితే కీలక సమయంలో వికెట్లు కోల్పోవడంతో భారత్ 49.1 ఓవర్లలో 265 పరుగులకు ఆలౌటైంది.పాకిస్థాన్ బౌలర్లలో అలీ రజా, హసన్ నవాజ్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు.దీంతో పాకిస్థాన్-ఏ జట్టు 48 పరుగుల తేడాతో విజయం సాధించింది. అద్భుతమైన శతకంతో పోరాడిన తిలక్ వర్మకు చివరకు నిరాశే ఎదురైంది.

చిరంజీవి 'మెగావర్స్' టాక్ షో..

హైదరాబాద్‌లో నెట్‌ఫ్లిక్స్ భారీ ఈవెంట్





టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి డిజిటల్ వేదికపై సరికొత్త అవతారంలో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఆయన తొలిసారిగా ఓ సెలబ్రిటీ టాక్ షో హోస్ట్‌గా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ షోకు 'మెగావర్స్' (వీవస్త్రుఱవతీంవ) అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. సినీ పరిశ్రమలోని ప్రముఖులతో ముచ్చటించే ఈ టాక్ షో లాంచ్‌కు సంబంధించి ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి.సమయం తెలుగు కథనం ప్రకారం.. ఈ షో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నవంబర్ 30, 2026న హైదరాబాద్‌లో అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. నెట్‌ఫ్లిక్స్ ఆధ్వర్యంలో జరగనున్న ఈ వేడుకకు పలువురు సినీ ప్రముఖులతో పాటు భారీ సంఖ్యలో మెగా అభిమానులు హాజరుకానున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో 'జన×=ూబిజీజుజుఎ×' పేరుతో భారీ హోర్డింగులు కూడా ఏర్పాటు చేశారు. ఈ షోకు సంబంధించిన తొలి ప్రోమో అతి త్వరలోనే విడుదలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.ఈ టాక్ షో చిత్రీకరణకు సంబంధించి ఇప్పటికే కొన్ని ఎపిసోడ్ల షూటింగ్ పూర్తయినట్లు తెలుస్తోంది. ఇక ఈ షోలో పాల్గొనే అతిథుల విషయానికొస్తే సినీ దిగ్గజాలు కమల్ హాసన్, నాగార్జునలతో పాటు ప్రభాస్, పవన్ కల్యాణ్, రామ్ చరణ్, రవితేజ, నాని, హాస్యనటులు బ్రహ్మానందం, సత్య తదితరులు కనిపించే అవకాశం ఉన్నట్లు పరిశ్రమ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే, అతిథుల జాబితాకు సంబంధించి నిర్వాహకుల నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.గతంలో పలు టెలివిజన్ షోలకు వ్యాఖ్యాతగా వ్యవహరించి మెప్పించిన చిరంజీవి, తొలిసారి ఓటీటీ ప్లాట్‌ఫామ్‌పై టాక్ షో చేయనుండటం సినీ వర్గాలతో పాటు ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలను పెంచుతోంది. ఒకే వేదికపై చిరంజీవితో పాటు స్టార్ హీరోలు పాల్గొనే ఎపిసోడ్లు అభిమానులకు సరికొత్త అనుభూతిని అందించనున్నాయి.

అల్లు సినిమాస్‌లో టికెట్లు బ్లాక్..?


వెంటనే స్పందించిన అల్లు అరవింద్



హైదరాబాద్‌లోని ప్రముఖ మల్టీప్లెక్స్ అల్లు సినిమాస్‌లో టికెట్ల రిజర్వేషన్‌కు సంబంధించిన ఆరోపణలపై ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ తక్షణమే స్పందించారు. టికెట్ల బ్లాకింగ్ వ్యవహారంపై ప్రేక్షకులు ఫిర్యాదు చేయడంతో, ఆ సమస్యను వెంటనే పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు.నవంబర్ 20న విడుదలైన దుల్కర్ సల్మాన్ చిత్రం 'ఆకాశంలో ఒక తార' ప్రదర్శన అనంతరం అల్లు అరవింద్ థియేటర్ నుంచి బయటకు వస్తుండగా పలువురు సినీ ప్రేక్షకులు ఆయనను కలిశారు. ముఖ్యంగా పెద్ద సినిమాల విడుదల సమయంలో డాల్బీ స్క్రీన్ టికెట్లను షో ప్రారంభ సమయానికి కొద్దిసేపటి ముందే అందుబాటులోకి తెస్తున్నారని, అంతవరకు కేవలం కింద ఉండే నాలుగు వరుసల సీట్లను మాత్రమే బుకింగ్ కోసం ఉంచుతున్నారని వారు ఆయన దృష్టికి తీసుకెళ్లారు.ప్రేక్షకుల సమస్యను సావధానంగా విన్న అల్లు అరవింద్, ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా అక్కడికక్కడే తన థియేటర్ సిబ్బందికి వీడియో కాల్ చేశారు. ఫిర్యాదును స్వయంగా వివరించాలని అక్కడున్న ప్రేక్షకులను కోరారు. అనంతరం ప్రేక్షకులతో మాట్లాడుతూ.. "ఈ వ్యవహారాన్ని నేను స్వయంగా పర్యవేక్షిస్తాను. కేవలం రెండు వరుసలు మినహా మిగిలిన అన్ని సీట్లను ప్రజల బుకింగ్ కోసం విడుదల చేయాలని సిబ్బందిని ఆదేశిస్తాను" అని స్పష్టమైన భరోసా ఇచ్చారు.అల్లు అరవింద్ ప్రేక్షకులతో మాట్లాడి, సిబ్బందికి అక్కడికక్కడే సూచనలు చేసిన దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'తో పాటు ఇతర మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ప్రేక్షకుల సమస్యపై ఆయన వెంటనే స్పందించిన తీరును పలువురు అభినందిస్తున్నారు.

మరింత క్వాలిటీ కోసం..

రష్మిక మందన్న 'మైసా' విడుదల వాయిదా



ప్రముఖ నటి రష్మిక మందన్న ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మైసా' విడుదల వాయిదా పడింది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ చిత్రం నవంబర్ 27న ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది. అయితే థియేటర్లలోకి రావడానికి సరిగ్గా ఐదు రోజుల ముందు మేకర్స్ ఈ సినిమా విడుదలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించడం గమనార్హం.ఈ మేరకు చిత్ర నిర్మాణ సంస్థ 'అన్‌ఫార్ములా ఫిల్మ్స్', దర్శకుడు రవీంద్ర పుల్లే ఇన్‌స్టాగ్రామ్ వేదికగా సంయుక్తంగా ఒక అధికారిక ప్రకటనను విడుదల చేశారు. "తెలుగు సినిమా ప్రస్తుతం ఎంతో ఆసక్తికరమైన దశలోకి ప్రవేశించింది. అద్భుతమైన ప్రతిభ, సాంకేతిక విలువలతో కూడిన సినిమాలతో పరిశ్రమ స్థాయి నిరంతరం పెరుగుతోంది. అదే స్ఫూర్తితో 'మైసా' చిత్రాన్ని కూడా సాంకేతికంగా అత్యున్నత ప్రమాణాలతో, సరికొత్త యాక్షన్ విజువల్స్ తో పెద్ద తెరపై ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతిని ఇచ్చేలా రూపొందిస్తున్నాం. మేము అనుకున్న ఈ విజన్‌ను ఎలాంటి రాజీ లేకుండా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే ఉద్దేశంతోనే నవంబర్ 27న జరగాల్సిన థియేట్రికల్ విడుదలను వాయిదా వేయాలని నిర్ణయించాం" అని చిత్ర బృందం తమ ప్రకటనలో వివరించింది. అయితే కొత్త విడుదల తేదీని ప్రస్తుతానికి వెల్లడించలేదని, అతి త్వరలోనే ప్రకటిస్తామని తెలిపింది. ప్రేక్షకులు ఈ చిత్రం కోసం ఎక్కువ కాలం వేచి ఉండాల్సిన అవసరం రాదని మేకర్స్ భరోసా ఇచ్చారు.చిత్ర యూనిట్ విడుదల చేసిన అధికారిక ప్రకటనపై కథానాయిక రష్మిక మందన్న సోషల్ మీడియా ద్వారా స్పందించారు. ఈ ప్రకటనను తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పంచుకుంటూ.. "సినిమా విడుదల వాయిదా పడుతోంది. ఎప్పటికి వస్తుందో నాకూ ఇంకా తెలియదు. కానీ విడుదల తేదీ ఎప్పుడనేది నాకు తెలిసిన వెంటనే కచ్చితంగా మీతో పంచుకుంటాను" అని రష్మిక పేర్కొన్నారు.ఈ చిత్రానికి రవీంద్ర పుల్లే దర్శకత్వం వహిస్తుండగా, ఆయనతో పాటు రాజ్ కుమార్ కందమూడి కథను సమకూర్చారు. ఈ సినిమాను తెలుగుతో పాటు హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో రష్మికతో పాటు ఈశ్వరీ రావు, రాహుల్ రవీంద్రన్, సముద్రఖని, రావు రమేశ్, శివ కందుకూరి, కార్తీక్ రంజని, తారక్ పొన్నప్ప, నిధి సింగ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

కేబీసీలో చలించిపోయిన అమితాబ్..

రోజూ 4 వేల మంది ఆకలి తీరుస్తున్న సామాజిక కార్యకర్తకు రూ. 21 లక్షల విరాళం



బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ తన గొప్ప మనసును చాటుకున్నారు. 'కౌన్ బనేగా కరోడ్‌పతి' (కేబీసీ) వేదికపై సిమ్లాకు చెందిన ఓ సామాజిక కార్యకర్త నిస్వార్థ సేవ గురించి తెలుసుకుని చలించిపోయారు. వెంటనే తన వ్యక్తిగత ఖాతా నుంచి ఏకంగా రూ. 21 లక్షల విరాళాన్ని ఆ సంస్థకు అందించారు.సిమ్లాకు చెందిన సామాజిక కార్యకర్త సర్బ్‌జీత్ సింగ్ బాబీ 'ఆల్మైటీ బ్లెస్సింగ్స్' అనే స్వచ్ఛంద సంస్థను నడుపుతున్నారు. ఇటీవల ఆయన కేబీసీ కార్యక్రమంలో 'ఫోర్స్ ఆఫ్ గుడ్' గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా ఆయన చేస్తున్న సేవల గురించి తెలుసుకున్న అమితాబ్, కార్యక్రమం పూర్తయిన తర్వాత ప్రశంసల లేఖతో పాటు ఈ భారీ మొత్తాన్ని విరాళంగా పంపారు. ఇది షో తరపున కాదని, పూర్తిగా తన వ్యక్తిగత నిర్ణయమని స్పష్టం చేశారు.సర్బ్‌జీత్ సింగ్ బృందం గత 12 ఏళ్లుగా సిమ్లాలోని ఆసుపత్రుల వద్ద రోగుల సహాయకులకు, పేదలకు ఉచితంగా భోజనం అందిస్తోంది. రోగులతో పాటు వచ్చే వారి కుటుంబ సభ్యులు ఆహారం కోసం ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీని ద్వారా ప్రతిరోజూ సుమారు 4,000 మంది ఆకలి తీరుతోంది.అంతేకాకుండా, గత 28 ఏళ్లుగా ఎవరూ క్లెయిమ్ చేయని అనాథ మృతదేహాలకు గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహిస్తూ మానవత్వాన్ని చాటుతున్నారు. రక్తదాన శిబిరాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో సహాయక చర్యలు వంటి కార్యక్రమాలను కూడా ఈ సంస్థ చేపడుతోంది.అమితాబ్ బచ్చన్ అందించిన ఆర్థిక సాయంపై సర్బ్‌జీత్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ విరాళం తమ సేవా కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు ఎంతగానో తోడ్పడుతుందని కృతజ్ఞతలు తెలిపారు. ఈ గుర్తింపు తన ఒక్కడిది కాదని, తనతో పాటు పనిచేస్తున్న వాలంటీర్లు, దాతల సమష్టి కృషి ఫలితమని ఆయన పేర్కొన్నారు.

నాగచైతన్య లైఫ్ ఫిలాసఫీ..

సమస్యలపై అక్కినేని హీరో ఇంట్రెస్టింగ్ కామెంట్స్!



టాలీవుడ్ యువ హీరో నాగచైతన్య ప్రస్తుతం తన తాజా చిత్రం వృషకర్మ ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారు. సినిమా ప్రచారంలో భాగంగా ఆయన అభిమానులను కలుసుకుంటూ సందడి చేస్తున్నారు. ఈ క్రమంలో ఫ్యాన్స్‌తో జరిగిన ఓ ఇంటరాక్షన్‌లో నాగచైతన్య చెప్పిన కొన్ని మాటలు ఇప్పుడు ఆసక్తికరంగా మారాయి. ముఖ్యంగా జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఎలా స్వీకరించాలి? కష్టకాలంలో మనల్ని మనం ఎలా నడిపించుకోవాలి? అనే విషయాలపై ఆయన చెప్పిన మాటలు అందరినీ ఆలోచింపజేస్తున్నాయి.సాధారణంగా జీవితంలో ఏదైనా సమస్య ఎదురైతే చాలామంది ఎందుకు తమకే ఇలా జరుగుతోందని బాధపడుతుంటారు. మరికొందరు చిన్న ఇబ్బందులను కూడా పెద్ద సవాళ్లుగా భావించి ఆందోళన చెందుతారు. అయితే ఇలాంటి పరిస్థితుల్లో మన ఆలోచనా విధానం మార్చుకోవాలని నాగచైతన్య చెప్పుకొచ్చారు. ప్రతి సమస్యను ఛాలెంజ్‌గా చూడాల్సిన అవసరం లేదని ఆయన అన్నారు. "నేను వాటిని ఛాలెంజెస్ అని పిలవను బ్రో" అంటూ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ప్రతి ఒక్కరి జీవితంలో మంచి రోజులతో పాటు కష్టమైన రోజులు కూడా ఉంటాయని నాగచైతన్య గుర్తుచేశారు. ఎప్పుడూ మనకు అనుకూలమైన పరిస్థితులే ఉండాలని ఆశించడం సాధ్యం కాదని చెప్పారు. ఒక్కోసారి మనం ఊహించని సంఘటనలు ఎదురుకావచ్చు. అలాంటి సమయంలో ఎందుకు ఇలా జరిగిందని పదేపదే ఆలోచిస్తూ బాధపడటం కంటే, వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకోవడం ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు జీవితంలో ఎదురయ్యే పరిస్థితులకు అనుగుణంగా మనల్ని మనం మార్చుకోవాలని నాగచైతన్య సూచించారు. సమస్య వచ్చినప్పుడు దాని గురించి ఎక్కువగా ఆందోళన చెందకుండా, దాని నుంచి బయటపడటానికి ఏం చేయాలనే దానిపై దృష్టి పెట్టాలని చెప్పారు. ఇదిలా ఉంటే, నాగచైతన్య నటిస్తున్న వృషకర్మ సినిమాపై ఇప్పటికే మంచి ఆసక్తి నెలకొంది. 'విరూపాక్ష' చిత్రంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న దర్శకుడు కార్తీక్ దండు ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. మైథలాజికల్ అంశాలతో కూడిన మిస్టరీ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. డిసెంబర్ 4, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయడానికి మేకర్స్ సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి టీజర్‌తో పాటు రెండు పాటలను విడుదల చేశారు. తాజాగా వచ్చిన 'చలో పడవే' అనే రెండో పాటలో నాగచైతన్య పోషిస్తున్న అర్జున్ పాత్రకు, చిన్నారి కియారా ఖన్నా పాత్రకు మధ్య ఉన్న భావోద్వేగ అనుబంధాన్ని చూపించారు. ఈ పాటకు మంచి స్పందన వస్తోంది. సినిమాలో మీనాక్షి చౌదరి, జయరామ్, సత్య, స్పర్ష్ శ్రీవాస్తవ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. బి. అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు.

మెల్లగా పాత లుక్‌లోకి వస్తున్న డార్లింగ్..



ప్రభాస్‌ను చూసి పాత రోజులు గుర్తొస్తున్నాయని ఫ్యాన్స్ అంటున్నారు. గత కొంతకాలంగా డార్లింగ్ లుక్‌పై రకరకాల కామెంట్స్ వినిపిస్తుండగా, ఇప్పుడు లేటెస్ట్ ఫొటోలు మాత్రం కాస్త డిఫరెంట్‌గా ఉన్నాయి. హెయిర్ స్టైల్, గడ్డం, ముఖంలో కనిపిస్తున్న మార్పుతో ప్రభాస్ మెల్లగా తన పాత లుక్‌లోకి వస్తున్నట్లున్నారు. ముఖ్యంగా బ్లాక్ కుర్తాలో చాలా సింపుల్‌గా కనిపిస్తున్న ఫొటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఇంతకుముందు కనిపించిన పొడవాటి జుట్టు గెటప్పులతో పోలిస్తే ఈసారి స్టైలింగ్ చాలా నీట్‌గా ఉంది. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో ఆదివారం జరిగిన భేటీలో ప్రభాస్ ఇలా కనిపించారు. బ్లాక్ కుర్తా, జీన్స్, గ్రీన్ షేడ్స్‌తో ఎలాంటి హడావుడి లేకుండా వచ్చారు. గతంలో కంటే జుట్టు కాస్త సెట్ అయినట్లు, గడ్డం కూడా ట్రిమ్ చేసినట్లు కనిపిస్తోంది. ఇద్దరూ కలిసి కూర్చుని మాట్లాడుతున్న ఫొటోలతో పాటు టీషర్టులు ఆవిష్కరించిన పిక్స్ కూడా బయటకు వచ్చాయి. అయితే ఈసారి అందరి చూపు ప్రభాస్ లుక్‌పైనే పడింది



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613